ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -261 పేజీలు - 08 వెల - 04/- శనివారం 26 జూలై 2025

# జనగణన లెక్కల తర్వాతే డీలిమిటేషన్..!

## ఏపీ, తెలంగాణ డీలిమిటేషన్ పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీంకోర్టు

- రెండు తెలుగు రాష్ట్రాల్లో డీలిమిటేషన్‌పై పురుషోత్తం రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ కొట్టివేత
- ఏపీ పునర్‌వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 26 ప్రకారం నియోజకవర్గాల పెంపు ప్రతిపాదనకు ఆదేశాలు ఇవ్వాలని 2022లో పిటిషన్ దాఖలు
- ఈ పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కోటేశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం విచారణ
- జనగణన లెక్కల తర్వాతే డీలిమిటేషన్ నిర్వహిస్తామని చట్టంలో స్పష్టంగా ఉందని వ్యాఖ్య







న్యూఢిల్లీ,**జూలై 25ఆంధ్ర ప్రగతి**
ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో నియోజకవర్గాల పునర్విభజనపై దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. దీనిని ఆమోదించ లేమని, దీనివల్ల ఇతరరాష్ట్రాల్లో సమస్యలు వస్తాయని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. 2026లో మొదటి జనగణన తర్వాత మాత్రమే డీలిమిటేషన్ నిర్వహిస్తామని చట్టంలో స్పష్టంగా చెప్పారని పేర్కొంది. ఇలాంటి వ్యాజ్యాన్ని అనుమతించడం వల్ల ఇతర రాష్ట్రాల్లో కూడా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలన్న వ్యాజ్యాలు వరదల్లా వస్తాయని, గేట్లు తెరిచినట్లు అవుతుందని ధర్మాసనం అభిప్రాయపడింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లలో అసెంబ్లీ సీట్లు- పెంచేందుకు నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ నిర్వహించేలా కేంద్రప్రభుత్వాన్ని ఆదేశించాలని దాఖలైన పిటిషన్ ను సుప్రీంకోర్టు శుక్రవారంనాడు తిరస్కరించింది. మిగతాది 2లో...

## మూడేళ్లలో రూ.295 కోట్ల ఖర్చు

- మోదీ విదేశీ పర్యటనలు..
- ఒక్క ఫ్రాన్స్ పర్యటనకే రూ.25 కోట్లు
- ఇటీవలి ఐదు దేశాల పర్యటనకు రూ.67 కోట్లు
- రాజ్యసభలో విదేశాంగ శాఖ వెల్లడి



2లో.

## కర్నూలు జిల్లాలో డ్రోన్ నుంచి క్షిపణి పరీక్ష..

- ◆ట్వీట్ చేసిన రాజ్‌నాథ్ సింగ్
- ◆కర్నూలులోని ఎన్‌ఓఏఆర్‌లో ప్రతిష్ఠాత్మక పరీక్ష
- ◆డీఆర్డీవో, క్షిపణి అభివృద్ధి భాగస్వాములను అభినందించిన రాజ్‌నాథ్ సింగ్
- ◆'ఎక్స్' వేదికగా ఫొటోను పంచుకున్న కేంద్ర మంత్రి



కర్నూలు**జూలై 25ఆంధ్ర ప్రగతి**
డ్రోన్ నుండి క్షిపణి ప్రయోగాన్ని విజయవంతంగా పరీక్షించినట్లు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ఈ పరీక్ష ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాలో గల నేషనల్ ఓపెన్ ఏరియా రేంజి (ఎన్‌ఓఏఆర్)లో జరిగింది. ఈ ప్రయోగానికి సంబంధించిన ఫొటోను ఆయన 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు.డీఆర్డీఓ, ఈ క్షిపణి అభివృద్ధి మరియు తయారీలో భాగస్వాములైన ఎంఎస్‌ఎంఈలు, స్టార్టప్స్‌లను రాజ్‌నాథ్ సింగ్ అభినందించారుమిగతాది 2లో...

## అక్రమ మైనింగ్ కేసులో శ్రీలక్ష్మికి చుక్కెదురు

### రివిజన్ పిటిషన్‌ను కొట్టేసిన తెలంగాణ హైకోర్టు



హైదరాబాద్,**జూలై 25 (రిపబ్లిక్ న్యూస్)**
ఓబుళాపురం అక్రమ మైనింగ్ కేసులో ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మికి తెలంగాణ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తనను నిర్దోషిగా ప్రకటించాలంటూ ఆమె ఉన్నత న్యాయస్థానంలో రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన ధర్మాసనం ఆమె పిటిషన్‌ను కొట్టివేసింది. ఓఎంసీ కేసులో శ్రీలక్ష్మిని న్యాయస్థానం ఇప్పటికే నిందితురాలిగా తేల్చింది.మిగతాది 2లో...

## 'బంగారు కుటుంబాల'ను దత్తత తీసుకుంటా

- చంద్రబాబు నాయుడు కీలక నిర్ణయం..
- పేదరికంపై చేస్తున్న పోరులో తన కుటుంబ సభ్యులు భాగస్వాములు అవుతారన్న చంద్రబాబు
- ఎన్నారైలు, పారిశ్రామికవేత్తలు బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలన్న ముఖ్యమంత్రి




విజయవాడ **జూలై 25ఆంధ్ర ప్రగతి**
ఆంధ్రప్రదేశ్‌లో పేదరిక నిర్మూలనలో భాగంగా తాను కొన్ని బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటానని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. పేదరికంపై చేస్తున్న పోరులో తనతో పాటు తన కుటుంబ సభ్యులు భాగస్వాములు అవుతారని ఆయన తెలిపారు. సచివాలయంలో జీరో పావర్టీ - పీ4పై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, పీ4 కార్యక్రమం ప్రజా ఉద్యమంలా సాగుతోందని ఆయన అన్నారు. పేద కుటుంబాల సాధికారతే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. పీ4లో కార్పొరేట్ సంస్థలు కలిసి వచ్చేలా చూడటంతో పాటు సమన్వయం చేసుకోవాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్లదే అని ఆయన అన్నారు.
మిగతాది 2లో...

## ఐదోరోజూ సాగని పార్లమెంట్

- ఉభయ సభల్లో విపక్షాల నిరసన
- సోమవారానికి వాయిదా పడ్డ ఉభయసభలు

2లో.



## మొదటి దశ మూడేళ్లలో పూర్తి

- విజయవాడ, విశాఖపట్నం మెట్రో ప్రాజెక్టులపై మంత్రి నారాయణ కీలక ప్రకటన
- మొదటి దశ పనులను మూడేళ్లలో పూర్తి చేస్తామని వెల్లడి
- విజయవాడ మెట్రోకు రెండు రోజుల్లో టెండర్లు పిలుస్తామన్న మంత్రి
- ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్, సిస్టా, టిప్సా కన్సల్టెన్సీలతో అవగాహన ఒప్పందం

విజయవాడ **జూలై 25ఆంధ్ర ప్రగతి**
విశాఖపట్నం, విజయవాడ మెట్రో మొదటి దశ పనులను మూడేళ్లలో పూర్తి చేస్తామని మంత్రి నారాయణ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఈ రెండు ముఖ్య నగరాల మెట్రో ప్రాజెక్టులకు నిధుల కేటాయింపునకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.మిగతాది 2లో...



## బిసి రిజర్వేషన్లు తప్పుల తడక

- కేవలం ముస్లింలకు మాత్రమే లబ్ది
- ఎంఐఎంకు లబ్ది చేకూరేలా రిజర్వేషన్లు
- బిసిని ప్రధానిని చేసిన ఘనత బిజెపిది
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్,**జూలై 25ఆంధ్ర ప్రగతి** రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న రిజర్వేషన్లతో నిజమైన బిసిలు నష్టపోతారని బిజెపి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. బిసిలకు రిజర్వేషన్ పేరుతో ముస్లింలకు రిజర్వేషన్ కల్పిస్తున్నారని అన్నారు. నాంపల్లిలో పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ..10 శాతం ఈబిసి రిజర్వేషన్లను ముస్లింలు కూడా పొందుతున్నారని తెలియజేశారుమిగతాది 2లో...



## శ్రావణమాసం ఆరంభం

### వ్రతాలు, నోములకు పెద్దపీట

7లో.



# 'బంగారు కుటుంబాల'ను దత్తత తీసుకుంటా

(మొదటి పేజీ తరువాయి)

గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని ఆ ప్రాంతానికి చెందిన ఎన్ఆర్ఐలు, పారిశ్రామికవేత్తలు స్థానిక బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా చూడాలని సూచించారు. ఆగస్టు 15 నాటికి 15 లక్షల బంగారు కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకునేలా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.ఇప్పటి వరకు 5,74,811 బంగారు కుటుంబాలను దత్తత తీసుకోగా, 57,503 మంది మార్గదర్శులుగా నమోదు చేసుకున్నారని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. లక్ష్యం నెరవేరడానికి మరో రెండు లక్షల మంది మార్గదర్శులు అవసరమని తెలిపారు. పల్నాడు జిల్లా నుంచి అత్యధికంగా బంగారు కుటుంబాల దత్తత జరిగిందని, విశాఖపట్నం చివరలో ఉందని అధికారులు వివరించారు. దత్తత తీసుకున్న కుటుంబాలకు ఆటోమేటెడ్ సందేశం రూపంలో సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

# అక్రమ మైనింగ్ కేసులో శ్రీలక్ష్మికి చుక్కెదురు

(మొదటి పేజీ తరువాయి)

కోర్టు తీర్పుతో ఆమె పాత్రపై సీబీఐ విచారణ జరపనుంది. ఓబుళాపురం మైనింగ్ కేసులో వై.శ్రీలక్ష్మి దాఖలు చేసిన డిశ్చార్జి పిటిషన్‌ను 2022 అక్టోబరులో సీబీఐ కోర్టు కొట్టేసింది. దీన్ని సవాలు చేస్తూ ఆమె తెలంగాణ హైకోర్టులో రివిజన్ పిటిషన్ దాఖలుచేశారు. ఉమ్మడి ఏపిలో 2006లో శ్రీలక్ష్మి పరిశ్రమల శాఖ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన తరువాతే ఓఎంసీ మైనింగ్ లీజ్ వ్యవహారం ముందుకు సాగిందని సీబీఐ తరఫు న్యాయవాది హైకోర్టులో వాదించారు. ఓఎంసీ లీజులు కట్టబెట్టడానికి అమె అన్ని రకాలుగా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని సీబీఐ తెలిపింది. ఈ కేసులో ఆరో నిందితురాలైన శ్రీలక్ష్మి.. వాస్తవాలను తొక్కిపెట్టి మరోసారి ఇక్కడ పిటిషన్ దాఖలు చేశారంటూ తెలంగాణ హైకోర్టుకు సీబీఐ నివేదించింది. గతంలో దీనిపై విచారించిన ఉన్నత న్యాయస్థానం.. శ్రీలక్ష్మి పిటిషన్‌ను అనుమతించింది. ఆమెను కేసు నుంచి తప్పిస్తూ తీర్పు వెలువరించింది. దీంతో సీబీఐ సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం.. సీబీఐ వాదన వినకుండా ఉత్తర్వులు జారీచేయడం సరికాదని అభిప్రాయపడింది. ఇరుపక్షాల వాదనలను పరిగణనలోకి తీసుకుని తాజాగా విచారణ చేపట్టాలంటూ ఈ పిటిషన్‌ను తిరిగి హైకోర్టుకు పంపింది. దీన్ని మూడు నెలల్లో తేల్చాలని ఆదేశించింది. గతంలో ఇదే కేసులో ఆమె పిటిషన్లను ఈ హైకోర్టు కొట్టేసిందని తెలిపింది. ఈ విషయాన్ని ప్రస్తుత రివిజన్ పిటిషన్‌లో ప్రస్తావించకుండా మరోసారి పిటిషన్ దాఖలు చేశారంది. ఓఎంసీకి లీజుల మంజూరులో అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు- స్పష్టమైన ఆధారాలున్నాయని, కింది కోర్టులో విచారణను ఎదుర్కోవాల్సిందేనని తెలిపింది. సీబీఐ వాదనలను పరిగణలోకి తీసుకున్న హైకోర్టు శ్రీలక్ష్మి పిటిషన్‌ను తోసిపుచ్చింది.

# కర్నూలు జిల్లాలో డ్రోన్ నుంచి క్షిపణి పరీక్ష..

(మొదటి పేజీ తరువాయి)

సంక్లిష్టమైన సాంకేతికతను అర్థం చేసుకోవడంతో పాటు ఉత్పత్తి చేయగల సామర్థ్యం భారతదేశానికి ఉందని ఈ పరీక్ష నిరూపించిందని ఆయన పేర్కొన్నారు.దేశీయంగా అభివృద్ధి చేసిన ఈ క్షిపణిని యూఏవీ లాంచ్‌డ్ ప్రెసిషన్ గైడెడ్ మిసైల్ (యూఎల్‌పీజీఎం)-వీ3గా వ్యవహరిస్తున్నారు. అయితే, దీని సాంకేతిక వివరాలను వెల్లడించలేదు. గతంలో డీఆర్డీవో పత్రాలు, బహిరంగ సమాచారం ప్రకారం గతంలో పరీక్షించిన యూఎల్‌పీజీఎం-వీ2 వేదికపైనే దీనిని అభివృద్ధి చేశారు.కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం పాలకొలను సమీపంలోని డీఆర్డీవోకు చెందిన ఎన్ఓఏఆర్ పరీక్ష కేంద్రాన్ని దీని కోసం ఎంచుకున్నారు. గతంలో కూడా ఇక్కడ డైరెక్టెడ్ ఎనర్జీ వెపన్స్ వ్యవస్థను పరీక్షించేందుకు ఇదే వేదికను ఉపయోగించారు. ఈ ఆయుధం ఫిక్స్‌డ్‌వింగ్ మానవరహిత విమానాలను కూల్చివేయడానికి ఉపయోగిస్తారు.

# మూడేళ్లలో రూ.295 కోట్ల ఖర్చు

## మోదీ విదేశీ పర్యటనలు..

**జూలై 25ఆంధ్ర ప్రగతి**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విదేశీ పర్యటనలకు సంబంధించి గత మూడేళ్లలో రూ.295 కోట్లు ఖర్చయిందని కేంద్ర విదేశాంగ శాఖ తెలిపింది. ఈ మేరకు గురువారం రాజ్యసభలో తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ డెరెక్ ఒబ్రెయిన్ అడిగిన ప్రశ్నకు విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ రాతపూర్వక సమాధానం ఇచ్చారు. ఇందులో మోదీ పర్యటనలకు సంబంధించి ఏ దేశానికి వెళ్లినపుడు ఎంత ఖర్చయిందనే వివరాలను ఆయన వెల్లడించారు.2021 నుంచి 2024 మధ్య కాలంలో ప్రధాని మోదీ విదేశీ పర్యటనల కోసం ప్రభుత్వ ఖజానా నుంచి దాదాపు రూ.295 కోట్లు వెచ్చించినట్లు మంత్రి తెలిపారు. ఇందులో ఒక్క ఫ్రాన్స్ పర్యటన (2025) కే రూ.25 కోట్లు ఖర్చయిందని వివరించారు. 2023 జూన్ లో మోదీ అమెరికా పర్యటనకు రూ.22 కోట్లు ఖర్చయిందన్నారు. ఇటీవల మోదీ ఐదు దేశాలలో పర్యటించగా దీనికోసం రూ.67 కోట్లు ఖర్చయిందని తెలిపారు. ఈ ఏడాదిలో మోదీ మారిషస్, సైప్రస్, కెనడా, క్రొయేషియా, ఘనా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, అర్జెంటీనా, బ్రెజిల్, నమీబియా దేశాలలో పర్యటించారు. అయితే, ఈ దేశాలకు సంబంధించిన ఖర్చులను మాత్రం మంత్రి వెల్లడించలేదు.

# మొదటి దశ మూడేళ్లలో పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

దీంతో ఇందుకు సంబంధించిన ప్రక్రియ వేగవంతమైంది. మెట్రో ప్రాజెక్టు, పర్యవేక్షణ, సాంకేతిక సహకారంపై కన్సల్టెన్సీలతో శుక్రవారం అవగాహన ఒప్పందం కుదిరింది.మంత్రి సమక్షంలో ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్, సిస్ట్రా, టిప్సా కన్సల్టెన్సీల ప్రతినిధులు అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ, విశాఖ మెట్రో ఫేజ్ 1లో భాగంగా 46.23 కిలోమీటర్లు పనులకు టెండర్లు పిలిచినట్లు చెప్పారు. ఫేజ్-2లో మరో 30 కిలోమీటర్లు ఉంటుందని తెలిపారు. విజయవాడ మెట్రో రైలుకు మరో రెండు రోజుల్లో టెండర్లు పిలుస్తామని వెల్లడించారు.

# తెలంగాణ కేబినేట్ భేటీ వాయిదా

## 28న జరపాలని సిఎం నిర్ణయం

హైదరాబాద్,**జూలై 25ఆంధ్ర ప్రగతి** : తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం వాయిదా పడింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈ నెల 25వ తేదీ శుక్రవారం జరగాల్సిన కేబినెట్ భేటీ వాయిదా పడింది. ఐదుగురు మంత్రులు ఢిల్లీలో ఉండటంతో తాత్కాలికంగా నిలిపివేశారు. తాజా నిర్ణయం ప్రకారం, మంత్రివర్గ సమావేశాన్ని ఈ నెల 28వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించాలని నిర్ణయించినట్లు- తెలుస్తోంది.మంత్రులు.. పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి.. ఢిల్లీలో జరుగుతున్న ఏఐసీసీ సమావేశంలో పాల్గొనేందుకు వెళ్లినట్లు- సమాచారం. ఈ సమావేశానికి సంబంధించి వారు కాంగ్రెస్ హైకమాండ్ సూచన మేరకు ఢిల్లీకి వెళ్లారు. ఇతర ఇద్దరు కీలక మంత్రులు.. డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా ప్రస్తుతం ఢిల్లీలోనే ఉన్నారు. దీంతో శుక్రవారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించాల్సిన రాష్ట్ర మంత్రిమండలి సమావేశం వాయిదా పడింది. దుగురు మంత్రులు దిల్లీలోనే ఉండటంతో క్యాబినెట్ సమావేశం వాయిదా వేయాలని సీఎం నిర్ణయించారు. ఈనెల 28న మధ్యాహ్నం 2 గంటలకు క్యాబినెట్ భేటీ- నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

# ఐదోరోజూ సాగని పార్లమెంట్

## ఉభయ సభల్లో విపక్షాల నిరసన

## సోమవారానికి వాయిదా పడ్డ ఉభయసభలు

న్యూఢిల్లీ,**జూలై 25ఆంధ్ర ప్రగతి** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు వరుసగా ఐదవరోజు శుక్రవారం ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించకుండానే వాయిదా పడ్డాయి. దీంతో సభ సోమవారానికి వాయిదా పడ్డాయి. బీహార్ ప్రత్యేక ఓటర్ల జాబితా ఎస్ఐఆర్ పై ప్రతిపక్షాలు నిరసన చేపడుతుంటే..చర్చ జరిపేందుకు అనుమతిని ఇవ్వకుండా ప్రభుత్వం మొండిపట్టు పడుతోంది. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నలుగురు కన్నా ఎక్కువ సభ్యులు ఉన్న పార్టీల లోక్‌సభ ఫ్లోర్ లీడర్లతో సమావేశాలు నిర్వహించారు. సమావేశం తర్వాత, ఏకాభిప్రాయం కుదిరిందని అన్నారు. లోక్‌సభ ఆపరేషన్ సిందూర్ గురించి సోమవారం చర్చ జరపనున్నట్లు తెలిపారు. సభ ప్రారంభమైన వెంటనే, ప్రతిపక్ష సభ్యులు బీహార్‌లో ఎస్ఐఆర్ సవరణ అంశాన్ని లేవనెత్తడానికి యత్నించారు. వారిలో చాలా మంది నినాదాలు చేపట్టారు. స్పీకర్ ఓంబిర్లా సభ్యులకు ప్రశ్నోత్తరాల సమయాన్ని కొనసాగించేందుకు అనుమతించమని చెప్పారు. ప్రతిపక్షాలు సభలో నినాదాలు చేపట్టడంతో పాటు- ప్లకార్డులు ప్రదర్శించారు. దీంతో సభను మధ్యాహ్నం 2.00 గంటల వరకు వాయిదా వేశారు. ముందుగా సభ ప్రారంభమైన వెంటనే తమిళనాడు నుండి కొత్తగా ఎన్ని-కై-న కమల్‌హాసన్, రాజాతి, ఎస్.ఆర్.శివలింగం, పి.విల్సన్‌లు ప్రమాణస్వీకారం చేశారు. బీహార్ ఎస్ఐఆర్ సహా వివిధ అంశాలపై చర్చను డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు ఇచ్చిన వాయిదా నోటీ-సులను డిప్యూటీ- చైర్మన్ హరివంశ్ రారు తిరస్కరించారు. ఇతర రాష్ట్రాల్లో బెంగాలీ వలసకార్మికులపై వివక్ష, భారత్ -యుకెల మధ్య టిఎస్ఎ ఒప్పందం వంటి వివిధ అంశాలపై చర్చ జరపాలని డిమాండ్ చేస్తూ రూల్ 267 కింద 28 నోటీ-సులిచ్చారు. మధ్యాహ్నం 12గంటల వరకు సభ వాయిదా పడింది. వాయిదా అనంతరం కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రశ్నోత్తరాల సమయంలో మాట్లాడటానికి యత్నించారు. కానీ ప్రతిపక్ష ఎంపిల నిరసనల మధ్య రాజ్యసభ సోమవారానికి వాయిదా పడింది.

# జనగణన లెక్కల తర్వాతే డీలిమిటేషన్..!

జస్టిస్ సూర్యకాంత్ ఆధ్వర్యంలోని ధర్మాసనం ఈ నిర్ణయం తీసుకుంది. కేంద్రపాలిత ప్రాంతమైన జమ్మూకశ్మీర్ తో పోలిస్తే, రాష్ట్రాలలో డీలిమిటేషన్ కు సంబంధించిన నిబంధనలు భిన్నంగా ఉన్నాయనే వాదనను కూడా ధర్మాసనం తిరస్కరించింది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 26ను అమలు చేసేలా కేంద్రానికి ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ప్రొఫెసర్ కె. పురుషోత్తం రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ పై సుప్రీంకోర్టు ఈ తీర్పు ప్రకటించింది. ఈ సందర్భంగా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పాలన విషయంలో గల తేడాను కూడా ధర్మాసనం ప్రస్తావించింది.జమ్మూ కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం జమ్మూ కశ్మీర్ ను కేంద్రపాలిత ప్రాంతంగా తిరిగి ఏర్పాటు- చేయడం వల్ల రాజ్యాంగంలోని 7వ భాగంలోని 3వ అధ్యాయంలోని నిబంధనలు వర్తించబోవని జస్టిస్ సూర్యకాంత్ ఆధ్వర్యంలోని ధర్మాసనం స్పష్టం చేసింది.జమ్మూకశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతంలో మాత్రమే డీలిమిటేషన్ పక్రియ చేపట్టి, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలను మినహాయించడం రాజ్యాంగ విరుద్ధమన్న వాదనను కూడా కోర్టు తిరస్కరించింది. రాజ్యాంగం ఆర్టికల్ 170(3) ప్రకారం డీలిమిటేషన్ కోసం వచ్చిన పిటిషన్ ను స్వీకరించడానికి వీలు లేదని కోర్టు పేర్కొంది. ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థికరణ చట్టం లోని సెక్షన్ 25 డీలిమిటేషన్ కు సంబంధించిన రాజ్యాంగం ఆర్టికల్ 170కి లోబడి ఉందని, దీని ప్రకారం 2026 లో చేపట్టనున్న జనాభా లెక్కల షెడ్యూల్ గణాంకాలను ప్రచురించిన తర్వాత మాత్రమే డీలిమిటేషన్ నిర్వహించవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.అంతకు ముందు విచారణ సందర్భంగా పిటిషనర్ తరుపు న్యాయవాది తన వాదనలను వినిపిస్తూ, ఏపీ, తెలంగాణాలను మినహాయించి, కొత్తగా ఏర్పడిన జమ్మూకశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతంలోనే అసెంబ్లీ, పార్లమెంటరీ నియోజకవర్గాల డీలిమిటేషన్ చేపట్టడం అసమంజసం, రాజ్యంగ విరుద్ధమని పేర్కొన్నారు.జమ్మూ కశ్మీర్ కోసం చేపట్టిన డీలిమిటేషన్ పక్రియను ప్రస్తావిస్తూ, ఆంధప్రదేశ్ పునరవ్యవస్థీకరణ చట్టం అమలులోకి వచ్చిన తర్వాత నియమింపబడిన ఏకై-క కమిషన్ ఈ డీలిమిటేషన్ కమిషన్ అని పిటిషనర్ తరుపు న్యాయవాది వాదించారు. ఈ సందర్భంలో సుప్రీంకోర్టు జస్టిస్ జోక్యం చేసుకుంటూ, కేంద్రం ఎప్పుడు డీలిమిటేషన్ చట్టం చేసినా అది అన్ని రాష్ట్రాలకు ఒకే విధంగా వర్తింపజేయాలన్నది మీ ఉద్దేశ్యమా అని న్యాయవాదిని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం తరుపున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ కె.ఎం. నటరాజ్ తన వాదనలో ఆంధప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 26ను ఎత్తిచూపారు. ఈ రాష్ట్రాలు డీలిమిటేషన్ పక్రియకోసం 2026 జనాభా లెక్కలవరకూ వేచి ఉండవలసిందేనని పేర్కొన్నారు. డీలిమిటేషన్ అనేది పెద్దఎత్తున చేపట్టవలసిన కసరత్తు అనీ, రాత్రికి రాత్రే దీనిని చేపట్టలేమని నాగరాజ్ వాదించారు. 2022లో ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కోటేశ్వర్‌సింగ్ ధర్మాసనం తుది ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 26 ప్రకారం నియోజకవర్గాల పెంపు ప్రతిపాదనకు ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ కోరారు. జమ్ముకశ్మీర్‌లో పునర్విభజన చేసే సమయంలో ఏపీ విభజన చట్టాన్ని పక్కన పెట్టి రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించారని పేర్కొన్నారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ..170(3) అధికరణం ప్రకారం ఏపీ విభజన చట్టంలో సెక్షన్ 26కి పరిమితి ఉందని తెలిపింది. కేంద్ర పాలిత ప్రాంతాలతో పోల్చినప్పుడు రాష్ట్రాల్లో డీలిమిటేషన్‌కు సంబంధించిన నిబంధనలు భిన్నంగా ఉంటాయని సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. జమ్మూకశ్మీర్‌పై ప్రత్యేక దృష్టి సారించారన్న పిటిషనర్ వాదనను న్యాయస్థానం తిరస్కరించింది. జమ్మూకశ్మీర్ కోసం జారీ చేసిన నియోజకవర్గాల పునర్విభజన నోటిఫికేషన్ నుంచి ఆంధ్రప్రదేశ్, తెలంగాణను మినహాయించడం.. ఏకపక్షం, వివక్ష కాదని స్పష్టం చెప్తూ పురుషోత్తం రెడ్డి పిటిషన్ సుప్రీంకోర్టు కొట్టివేసింది.

# ఉచిత బస్సులో ఇన్ని కొర్రీలా

## ఎక్స్ వేదికగా షర్మిల విమర్శలు

విజయవాడ,**జూలై 25ఆంధ్ర ప్రగతి** ఆంధప్రదేశ్ లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం నిబంధనలపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శలు గుప్పించారు. చిన్న పథకానికి ఇన్ని కొర్రీలు ఎందుకని అంటూ ప్రశ్నించారు. ఈ మేరకు ఆమె తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ పెట్టారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలు సూపర్ ఫ్లాప్ అన్నారు. ఆగస్ట్ 15న మహిళలకు ఉచిత బస్సు అంటున్నారు. ఉచిత బస్సు పథకం జిల్లాల వరకే పరిమితం చేస్తారట. చిన్న పథకానికి ఇన్ని కొర్రీలు ఎందుకు?. రాష్ట్రం మొత్తం ఉచిత ప్రయాణం కల్పిస్తే మీకు జరిగే నష్టం ఏంటి?. రాష్ట్రంలో రోజుకు 16 లక్షల మంది మహిళలు ప్రయాణిస్తున్నారని ఆర్టీసీ చెప్తుంది. ఒక జిల్లా నుంచి మరో జిల్లాకి వెళ్లడానికి ఉచితం ఎందుకు ఇవ్వరు?. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల మాదిరిగా రాష్ట్రం మొత్తం ఉచితంగా ప్రయాణం కల్పించండని ఆమె సూచించారు.

# బిసి రిజర్వేషన్లు తప్పల తడక

(మొదటి పేజీ తరువాయి)


42 శాతం రిజర్వేషన్లతో బిసిలకు న్యాయం జరగదని చెప్పారు. బిసి రిజర్వేషన్ వల్ల ఎంఐఎం పార్టీకే లబ్ధి చేకూరుతుందని అన్నారు. బిసిని ముఖ్యమంత్రి చేసిన చరిత్ర కాంగ్రెస్ కు ఉందా అని ప్రశ్నించారు.బిసిని ప్రధానిని చేసిన ఘనత బిజెపిదే అని కొనియాడారు. రాజకీయ లబ్ధి కోసమే బిసి రిజర్వేషన్ అంశాన్ని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎత్తుకుందని విమర్శించారు. ప్రజలు తిరస్కరిస్తున్నా కాంగ్రెస్ కు బుద్ధి రాలేదని మండిపడ్డారు. అధికారంలో ఉన్న 3 రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఓడిపోతుందని, నరేంద్ర మోడీ కులాన్ని కాంగ్రెస్ ప్రభుత్వమే బిసి జాబితాలో చేర్చిందని చెప్పారు. పెంచిన బిసి రిజర్వేషన్లతోనే ఎన్నికలు జరగాలని కోరుకుంటున్నాం అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఇకపోతే హైదరాబాద్ మెట్రో ఫేస్- 2 గురించి తెలంగాణ ముఖ్యమంత్రి పచ్చి అబద్ధాలు చెబుతున్నారు అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. ఈ మధ్యనే డిపీఆర్ కేంద్రానికి వచ్చింది.. మెట్రోపై అవగాహన లేకుండా రాష్ట్ర ప్రభుత్వం మాట్లాడుతుంది.. మెట్రో గురించి కాంగ్రెస్ సర్కార్ ఇంకా సమాచారం ఇవ్వాల్సి ఉంది.. సీఎంకి మెట్రో గురించి అవగాహన లేదు.. మెట్రో లైన్ల నిర్వాహణ ఎవరు చేస్తారు.. నష్టాలు ఎవరు భరిస్తారు.. గతంలో ఇచ్చిన సంస్థకు రెండో దశ నిర్మాణ నిర్వాహణ ఇస్తారా.. కొత్త సంస్థ వస్తే వాటితో సమన్వయం ఒప్పందం అంశాలు కేంద్రానికి తెలియజేయాల్సి ఉంటు-దన్నారు. మెట్రో విషయంలో కేంద్రం రాష్ట్రానికి సహకారంతో పాటు- నిధులను ఇస్తుంది.. మెట్రో విషయంలో కేంద్ర- రాష్ట్ర అధికారులతో సమావేశం ఏర్పాటు-కు మోడీ సర్కార్ సిద్ధంగా ఉంది అని కిషన్ రెడ్డి వెల్లడించారు. ఇక, నేను రాష్ట్ర అంశాలను అనేక సార్లు కేంద్రమంత్రుల దృష్టికి తీసుకెళ్లాను అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి వేసే పనికిరాని ప్రశ్నలకు నేను సమాధానం చెప్పాను అని తేల్చి చెప్పారు. కేసీఆర్ ను కాపాడాలని రాహుల్ గాంధీ చూస్తున్నారు.. కాంగ్రెస్- బీఆర్ఎస్ పార్టీల మధ్య అవగాహన కుదిరింది.. ఇక, బండి సంజయ్- ఈటల రాజేందర్ విషయంలో బీజేపీ అధిష్టానం నిర్ణయం తీసుకుంటుందని కిషన్ రెడ్డి తెలిపారు.

-----------

# బెంగాల్ తీరం దాటిన వాయుగుండం

## నాలుగు రోజుల పాటు తేలికపాటి వర్షాలు

హైదరాబాద్,**జూలై 25ఆంధ్ర ప్రగతి** వాయువ్య బంగాళాఖాతం, బెంగాల్ తీర ప్రాంతంలో ఏర్పడిన వాయుగుండం పశ్చియ వాయువ్య దిశగా కదిలి ఉదయం బెంగాల్-బంగ్లా తీరాలను దాటిందని వాతావరణశాఖ తెలిపింది. సాగర్ ద్వీపానికి 80 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందని పేర్కొంది. రాబోయే 24గంటల్లో ఉత్తర ఒడిశా, జార్ఖండ్ మీదుగా వాయువ్య, పశ్చిమ దిశగా కదిలే అవకాశం ఉందని తెలిపింది. ఉత్తరప్రదేశ్, ఉత్తర ఛత్తీస్‌గఢ్, ఒడిశా మీదుగా వాయుగుండం కేంద్రం వరకు ఉపరితల ద్రోణి సగటు- సముద్రమట్టానికి 4.5 కిలోమీటర్ల ఎత్తు వరకు కొనసాగుతుందని పేర్కొంది. ఇదిలా ఉండగా.. రాగల నాలుగురోజులు రాష్ట్రంలో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. శుక్రవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జయశంకర్, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, హన్మకొండ,



జనగాం, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని పేర్కొంది. శనివారం రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, బలమైన ఈదురుగాలులతో కూడిన వానలు పడే అవకాశాలున్నాయని వివరించింది. ఆదివారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వివరించింది. సోమవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24 గంటల్లో రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిశాయి. నిజామాబాద్, వికారాబాద్, కొత్తగూడెం, ఖమ్మం, ములుగు, వరంగల్, జనగాం, జయశంకర్, పెద్దపల్లి, మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్‌లో వర్షాలు కురిశాయి. అత్యధికంగా ఆసిఫాబాద్ జిల్లా రవీంద్రనగర్‌లో 7.5, కౌటాలలో 7.4, లోనవెల్లి 6.7 సెంటీ-మీటర్ల భారీ వర్షపాతం నమోదైంది.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
శనివారం 26 జూలై 2025

# వృద్ధుల సేవలో ఆరేళ్ల "ధ్రువ" సేవలు అద్భుతం..!







- రెండవతరగతి చదువుతూ.
- ఉదయం వృద్ధుల సేవ...ఎస్.డి.అర్.పాఠశాలలో చదువు...
- సాయంత్రం దేవుడి పూజలు...ఆటలు , చదువు ప్రతినిత్యం.
- సొంత మనవడికంటే ప్రేమతో,ఆప్యాయంగా చేస్తున్న సేవలు.
- ధ్రువ సేవలకు వృద్ధుల కళ్లలో ఆనందం.
- కని,పెంచిన పిల్లలకంటే ధ్రువ చేసే సేవలకు ఏమిచ్చినా రుణం తీర్చుకోలేము.
- చిన్న వయసులో సేవా,క్రమశిక్షణ కు సెల్యూట్ కొట్టాల్సిందే.
- స్నేహ వృద్ధాశ్రమం నిర్వాహకులు సోమిరెడ్డి,సావిత్రమ్మ ముద్దుల మనవడు" ధృవ"
- ఆ కుటుంబం అంతా వృద్ధుల సేవలోనే.
- 25 ఏళ్లుగా వృద్ధుల సేవలో తరిస్తున్న కుటుంబం.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 25:**
సృష్టిలో ఎన్నో జీవరాశులు జీవం పోసుకున్నాయి...దజీవరాశులతో పాటు రంగు,రంగుల పుష్పాలు....పకృతి సౌందర్యం...గల,గల పారే జలపాతాలు...దట్టమైన అడవులు...ఎత్తైన కొండలు కనువిందు చేసే అందాలు కళ్ళతో చూసి ఆనందించే అదృష్టాన్ని దేవుడు మానవ జన్మకే మహాభాగ్యం కల్పించాడు.అలాంటి మానవ జన్మలో కష్ట,సుఖాలు పెట్టాడు.సమాజంలో మానవతా విలువలు,ఆప్యాయతలు క్షీణించిపోయాయి. కని,పెంచిన తల్లిదండ్రులను సైతం కొందరు కనికరం లేకుండా వృద్ధాప్య సమయంలో కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన కన్న బిడ్డలు ఉన్నదంతా తీసుకొని వృద్ధాశ్రమంలో వదులు తున్నారు.పెళ్ళైన కొత్తలో కడుపున కాయ కాస్తే చెప్పలేని ఆనందం...పిల్లవాడు బుడి,బుడి నడకలు చూసి ఆ తల్లిదండ్రుల ఆనందం,అమ్మా,నాన్న అనే పిలుపులో ఆనందం...పెద్దవాడై స్కూల్ కు వెళ్లేటప్పుడు మారం చేస్తే కావలసినవన్నీ కొని పెట్టీ,తాము తిన్నా తినకపోయినా పస్తులుండైన పిల్లల కోర్కెలు ప్రతి తల్లిదండ్రులు తీరుస్తారు.కళ్ళ ముందే పిల్లలకు ఉద్యోగాలు,పెళ్ళిళ్ళు చక చకా జరిగిపోవడం ,ఉన్నదంతా పిల్లలకు ఇవ్వడం ,చివరికి వృద్యపం మీద పడటం ,కానీ పెంచిన పిల్లలు వృద్ధాప్యంలో కంటికి రెప్పలా చూసుకుంటారు అనే కొందరు తల్లిదండ్రులకు ఆశలు అడియాశలు చేస్తూ వృద్ధాశ్రమంలో వదిలివేలుతున్నారు.అలాంటి వృద్ధులకు నేనున్నాను అంటూ ఆరేళ్ల "ధ్రువ" చేస్తున్న సేవలపై ప్రత్యేక కథనం అందరి కనువిప్పు కల్గిస్తుంది.వివరాల్లోకి వెళితే నంద్యాల పట్టణంలో గత 25 ఏళ్ల క్రితం కేవలం 5 మందితో చిన్న కొట్టంలో స్నేహా వృద్ధాశ్రమం ను స్వామిరెడ్డి,సావిత్రమ్మ దంపతులు ఏర్పాటుచేశారు. స్వామిరెడ్డి కి పొలం డబ్బులు,వివిధ వ్యాపారాలు చేస్తూ వృద్ధాశ్రమం నడిపేవారు.పట్టణంలో కొందరి దాతలు సహకారం తో నెట్టుకొస్తున్నారు.గతంలో ఒక గుడిసెలో ఉన్న వృద్ధాశ్రమాన్ని పట్టణ శివారులో కొంత స్థలం కొనుగోలు చేసి అక్కడ ఇల్లు కట్టి వృద్ధులకు ఏ ఇబ్బందికుండా చూసుకుంటున్నారు.భార్య సావిత్రమ్మ వృద్ధులకు ఆప్యాయంగా పలకరిస్తూ అన్ని తానై చూసుకునేది.అనతి కాలంలోనే సేవలు చేస్తున్న విషయం తెలుసుకొని వివిధ ప్రాంతాల్లో కన్న పిల్లలు ,తల్లిదండ్రులు భారమై వదిలేసిన వారు స్నేహ వృద్ధాశ్రమం లో ఒక్కొక్కరుగా చేరుతూ ప్రస్తుతం 100 మంది వృద్ధులు వారి సేవలు పొందుతున్నారు.గత 25 ఏళ్లుగా విసుగు,కోపం అనేది లేకుండా కేవలం చిరునవ్వు, ప్రేమ,ఆప్యాయత తో ఒక్క పని వారు కూడా లేకుండా అన్ని వారే కాలకృత్యాలు,స్నానాలు సైతం చేయించడం విశేషం.ఉదయం వారికి ఏదికావాలన్నా పాలు,కాఫీ,టీ,టిఫిన మధ్యాహ్నం భోజనం,సాయంత్రం స్నాక్స్,రాత్రి భోజనం రుచికరమైన భోజనం అందిస్తున్నారు.ప్రతిరోజూ వృద్ధుల మధ్య కూర్చొని వింతలు విశేషాలు చెపుతూ కన్నా బిడ్డలను మరిచిపోయే విధంగా చివరి క్షణాలు మధురానుభూతి కలిగించేవిధంగా చేయడ ఆ దంపతులకు దక్కింది. స్వామిరెడ్డి,సావిత్రమ్మ లు ఏ జన్మలో పుణ్యం చేసుకున్నారో ఏమి బంగారు లాంటి కొడుకు తల్లిదండ్రుల సేవలో పాలువంచుకుంటున్నారు.కొడుకుకు పెళ్లిచేయడంతో వృద్ధుల సేవకి అంకితం అయ్యారు.ఉపేంద్రారెడ్డి ఆయన భార్య ప్రసన్న తో పాటు స్వామిరెడ్డి అన్న కొడుకు ఆనందరెడ్డి



కోడలు,మహాలక్ష్మి లు వంటపని లో సహాయం చేస్తున్నారు. వీరితో పాటు స్వామిరెడ్డి బావ మరిది సుబ్బారెడ్డి సైతం లో తన వంతు పాత్ర పోషిస్తున్నాడు.వృద్ధాశ్రమం అంతా క్లోనింగ్ సైతం ఆ కుటుంబం అంతా చేయడం విశేషం.ఇదంతా ఒక ఎత్తు అయితే నిర్వాహకుల ముద్దుల మనవడు ఆరేళ్ల ధ్రువ నేనుసైతం వృద్ధుల సేవలో అంటూ ఉదయం ఆరుగంటలకే వృద్ధుల సేవలో అంకితం అవడం ఔరా అనిపిస్తుంది.ఎస్.డి.అర్.పాఠశాలలో ధ్రువ రెండవ తరగతి చదువుతున్నాడు.ధ్రువ ప్రతి దిన చర్య ఉదయం 5 గంటలకే లేవడం కాలకృత్యాలు అయిపోయిన తర్వాత నేను ఉన్నాను అంటూ వృద్ధులను వీల్ చైర్ లో గదుల నుంచి వృద్ధులను బయటికి తీసుకొచ్చి నానమ్మ వారికి పళ్ళు తొమించి,స్నానాలకు అవసరమయ్యే వేడినీటిని అందిస్తూ సహాయం చేస్తున్నాడు.స్నానాలు అన్ని అయిపోయిన తర్వాత పైపు తీసుకొని ఆ ప్రాంతం అంతా నానమ్మ కు తోడుగా పైపు తో నీటిని అందించే సహాయం చేస్తున్నాడు.స్నానాలు చేసిన వారిని అందరినీ తిరిగి వారి వారి గదుల్లో కుర్చోబెట్టి ఆశ్రమంలో చేసిన టిఫిన్ అందరికీ ఇచ్చి వారి మధ్యనే కూర్చొని తిని దాదాపు 8 గంటలకు స్కూల్ కి వెళ్ళి చదువుకునేవాడు.సాయంత్రం స్కూల్ నుంచి ఇంటికి వచ్చి కాసేపు ఆటపాటలు లో తేలియాడుతూ హొమ్ వర్క్ చేసుకొని ,కాసేపు చదువుపై దృష్టి పెడుతున్నారు.తన చదువు,ఆటలు అయిపోయిన తర్వాత తిరిగి వృద్ధులకు ఏమి అవసరాలు ఉన్నా వారికి చేయడం నిత్య కృత్యంగా మారిపోయింది. స్వామిరెడ్డి, సావిత్రమ్మ మనవడా మజాకానా అనిపించుకున్నాడు.తల్లిదండ్రుల ప్రోత్సాహం,వృద్ధులపై తమ కుమారుడు చేస్తున్న ప్రేమ కు ఆ కుటుంబం కళ్ళల్లో ఆనంద భాష్పాలు చూస్తుంటే అందరి కళ్ళలో ఇలాంటి కుటుంబం ఏ జన్మలో చేసిన పుణ్యమో అని అనక తప్పదు.ధ్రువ చేస్తున్న సేవలు తెలుసుకోవడానికి కె.ఎస్.కే.ప్రతినిధి వృద్ధాశ్రమంలో ధ్రువ చేస్తున్న సేవలు ప్రత్యక్షంగా చూసి సేహాబాష్ అని నీ సేవకు సెల్యూట్ కొట్టి అభినందించారు.ఆశ్రమంలో కొందరు వృద్ధులను కదలించగా ఒకొక్కరు వారి బాధలు చెప్పుకొని కన్నీళ్ళ పర్యంతరం అయ్యారు.అల్లారీ ముద్దుగా పెంచి తిని,తినక డబ్బులు కూడబెట్టి పిల్లలను ప్రయోజకులను చేస్తే వృద్ధాప్య సమయంలో ఆసరగా ఉంటారనే అనుకున్నామని ఉన్నదంతా గుంచుకొని ఇక్కడ వదిలేశారని కొందరు కంట కన్నీరు కారుస్తూ చెప్పడం బాధ కలిగిస్తుంది.మేము అక్కడ ఉన్నా మా పిల్లలు ఇంత బాగా చూసుకుంటారో లేదో కానీ ఈ కుటుంబం ప్రేమ ,ఆప్యాయత తో పాటు ఏ నాడు పిల్లలు ఇక్కడ వదిలివేసారు అనే బాధ ను మరచిపోయే విధంగా చేస్తున్నారని ఈ కుటుంబం చేస్తున్న సేవలకు ఎన్ని జన్మలెత్తినా రుణం తీర్చుకోలేమన్నారు.కన్నా తల్లిదండ్రులు తిన్న కంచాలు ఎత్తలేని ఈ సమాజంలో అన్ని వారే చూసుకోవడం నిజంగా మా అదృష్టం అన్నారు.కుటుంబంలోని అందరితో పాటు వారి మనవడు ప్రతి రోజు ఉదయం,సాయంత్రం చేస్తున్న సేవలు అద్భుతం అని కొనియాడారు.సాయంత్రం స్కూల్ నుంచి వచ్చి మా అందరి వద్ద కూర్చొని అందరినీ అప్యాయంగా పలకరిస్తూ జోకులు,చిలిపి అల్లరి చేస్తూ నవ్విస్తూ అందరిని ఆటపట్టిస్తూ మా అందరి ముఖాల్లో చిరునవ్వులు చిందిస్తున్నారని ఆ వృద్ధులు ఆనందంగా చెప్పడం నిజంగా వారి అదృష్టం అనే భావించాలి.ప్రతి కుటుంబంలో తల్లిదండ్రుల నడవడిక,ఆప్యాయతలు,క్రమ శిక్షణ ఉంటే పిల్లలు సైతం ఆప్యాయత,క్రమ శిక్షణ పై దృష్టి పెడతారు. కని,పెంచిన పిల్లల కంటే ధ్రువ చేస్తున్న సేవలకు ఆశీర్వాదం తప్పా ఏమిచేయలేమని,ఆ దేవుడు ఈ కుటుంబ సభ్యులు అందరిని చల్లగా చూడాలని దీవించారు.25 ఏళ్లు వృద్ధుల కు సేవలు చేస్తున్న ఆ కుటుంబం కు సెల్యూట్ కొట్టాల్సిందే.చదువు,వృద్ధులకు సేవ,తల్లి దండ్రులు,నానయ్య,నానమ్మల ప్రోత్సాహం చిన్నారి ధ్రువ కు ఉండడం విశేషం.

## భూమి హక్కుల పరిరక్షణకు బాధ్యతగా కృషి చేయాలి.

### -జాయింట్ కలెక్టర్ సి విష్ణు చరణ్.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 25:**
ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా భూమి హక్కుల పరిరక్షణతో పాటు, ప్రజలకు న్యాయమైన విలువలు నిర్ధారించేందుకు కట్టుబడి బాధ్యతగా పనిచేయాలని జాయింట్ కలెక్టర్ సి విష్ణు చరణ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం నంద్యాల మండలం గుంతనాల గ్రామంలోని సర్వే నెంబర్లు 14 మరియు 17లోని భూముల మార్కెట్



విలువలలో గల వ్యత్యాసాలను సరి చేయాలన్న దృక్కోణంతో చిన్నపక్కిరమ్మతో పాటు మరికొందరు బాధితులచే సమర్పించబడిన వినతిని మండల తహశీల్దార్ తో కలిసి జేసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వారు తమ వినతిలో పేర్కొన్న విషయాలను ఆధారంగా సంబంధిత భూముల మార్కెట్ విలువలలో అసంగతులను గుర్తించారు. మార్కెట్ విలువల సవరణకు అవసరమైన చర్యలు చేపట్టే దిశగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు జేసీ సూచించారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం.

**ఆంధ్ర ప్రగతి శిరివెళ్ళ జూలై 25:**
మండల కేంద్రంలోని పసుల పేటలో శ్రీ సుబ్రహ్మణ్యశ్వర స్వామి దేవతా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామంలోని ప్రతి హిందువు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రముఖ పండితులు అయిన కేశవ శర్మ మరియు పవన్ శర్మ ల ఆధ్వర్యంలో హోమాలు , తదితర పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిష్ఠించిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహాలకు అనేక రకాల అభిషేకాలు చేసి పూలమాలలతో అలంకరించారు. ప్రతిష్ట మహోత్సవానికి భక్తులు భారీగా తరలి రావడంతో ఆ ప్రాంతం మొత్తం కిక్కిరిసిపోయి సుబ్రహ్మణ్యశ్వర స్వామి



నామ స్మరణతో మార్మోగిపోయి సందడిగా మారింది. ప్రతిష్టా కార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు అన్నదాన సదుపాయం కల్పించారు. భక్త బృందం సహకారంతో కోలాటం , తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కోలాటం వద్ద ఎలాంటి ఆటంకాలు జరగకుండా ఎస్ఐ పీరయ్య ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పెద్దలు యామ గురప్ప , పసుల పెద్ద లింగమయ్య , యామ శ్రీనివాసులు , ఉల్లి గురప్ప , పసుల రామకృష్ణ , పసుల నరేంద్ర , యాదవ కులస్తులు , గ్రామ ప్రజలు , తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలం.

**కె.జి నుండి పి.జి.వరకు విద్యారంగ సమస్యలను పరిష్కారం కోరుతూ విజయవాడలో ధర్నా చౌక్ లో మహా ధర్నా. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ 6400 కోట్లు ఫీజు రియంబర్స్మెంట్ విడుదల ఎప్పుడు.?**




**ఆంధ్ర ప్రగతి విజయవాడ జులై 25:** రాష్ట్రంలో విద్యారంగ సమస్యను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని, పి.డి.ఎస్.యు జాతీయ కన్వీనర్ రామకృష్ణ,రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎండి రఫీ ,పి.డి.ఎస్.యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్ అన్నారు. శుక్రవారం విజయవాడ నగరంలో ధర్నా చౌక్ ఎదుట కేజీ నుండి పీజీ వరకు విద్యారంగ సమస్యలు పరిష్కారం కోరుతూ పి.డి ఎస్.యు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పి.డి.ఎస్.యు జాతీయ కన్వీనర్ రామకృష్ణ, పి.డి.ఎస్.యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎండి రఫీ, పి.డి.ఎస్.యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న 6400 కోట్ల ఫీజు రీయింబర్సుమెంట్స్ స్కాలర్షిప్లు నేటి వరకు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్ర చట్టం పటిష్టంగా అమలు చేయాలని అన్నారు. పుస్తకాల పేరుతో లక్షల వ్యాపారం చేస్తున్న వారిపై నేటి వరకు విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోకపోవడం దారుణమని అన్నారు. సంక్షేమ హాస్టల్లో విద్యార్థులు అద్దభవనాల్లో ఆకలి కేకలతో అలమటిస్తున్నారని, తక్షణమే పెరిగిన ధరలకు అనుగుణంగా కాస్మెటిక్, మెస్ చార్జీలు పెంచాలని హాస్టల్ విద్యార్థులకు శాశ్వత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. నేటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాడు యువగళం పాదయాత్రగా ఇచ్చినటువంటి హామీలను తక్షణమే అమలు చేయాలని అన్నారు. ప్రధానంగా రాష్ట్రంలోని నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి 3 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్రంలో ఉన్న రెండు లక్షల 50 వేల అన్ని రకాల ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు. రాష్ట్ర ఉన్న ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఖాళీగా ఉన్న టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగా సమస్యలను పరిష్కరించకుండా రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ విదేశీ పర్యటనలు చేయడం దారుణమని అన్నారు. విద్యార్థి విద్యార్థులు రూ.6,400 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్, అదనపు బకాయి పడిపోయింది అని తెలియజేశారు. జీవో 77 వల్ల పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులు కేజీ నుంచి పీజీ వరకు విద్యకు దూరము అవుతున్నారని తెలియజేశారు. 2024-25లో తల్లికి వందనం పథకం అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2.50 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు . నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి 3000 రూపాయలు తక్షణమే అమలు చేయాలి డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టల్లో ఖాళీగా ఉన్న వార్డెన్,కుక్, కమాటి, వాచ్మెన్ పోస్టులను భర్తీ చేయాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు భాను, రాష్ట్ర సహాయ కార్యదర్శి సిద్దు ,రాష్ట్ర నాయకులు సోమశేఖర్ ,షాహిద్,నవీన్, వినోద్,కిరణ్,వంశీ, వివిధ జిల్లాల జిల్లాలో ప్రతిరిధులు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా జిపిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు వడిత్యా శంకర్ నాయక్ జన్మదిన వేడుకలు.





**జిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు రాజు నాయక్**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 25:** రాష్ట్రంలో ఉన్న నిరుపేద గిరిజనుల అభ్యున్నతికి కృషి చేస్తానని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ గిరిజన ప్రజా సమాఖ్య వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు వడిత్యా శంకర్ నాయక్ జన్మదిన వేడుకల్లో పేర్కొన్నారు. శుక్రవారం నంద్యాల పట్టణంలోని రైతు నగరంలో ఉన్న ప్రతిభ వయోవృద్ధుల ఆశ్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్, రాష్ట్ర కార్యదర్శి రవి నాయక్ ఆధ్వర్యంలో జాతీయ అధ్యక్షుడు వడిత్యా శంకర్ నాయక్ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. వృద్ధురాలితో కేక్ కట్ చేయించి మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ఆశ్రమంలో వందమందికి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాజు నాయక్ మాట్లాడుతూఅభివృద్ధికి ఆమడ దూరంలో నివసిస్తున్న గిరిజన ప్రజల శ్రేయస్సు కోసం, వారి సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తూ రాష్ట్రంలోఎక్కడ సమస్య ఉన్న తెలుసుకొని వారిని వెంటనే పరిష్కరించేందుకు జిపిఎస్ సంస్థ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తూ గిరిజన సమాజానికి అండగా నిలుస్తుందన్నారు.అదేవిధంగా శంకర్ నాయక్ ఎస్టీ కమిషన్ సభ్యుడిగా ఉన్నప్పుడు ఆయన అన్ని జిల్లాలు పర్యటిస్తూ గిరిజన బాగోగులు తెలుసుకొని వాటిని చక్కదిద్దేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సత్వర పరిష్కార దిశగా కృషి చేసిన వ్యక్తి శంకర్ నాయక్ అన్నారు. అంతేకాకుండా 20 సంవత్సరాలుగా విద్యార్థి దశ నుండి గిరిజనుల హక్కుల కోసం, తండాల రాజ్యం కోసం, నడుం%స్త్ర% బిగించి ఉద్యమాలు చేపడుతూ గిరిజనులను చైతన్యవంతం చేస్తున్నారన్నారు. అందర్నీ ఏకం చేసేందుకు ఉద్యమ బాట మొదలుపెట్టారన్నారు. శంకర్ నాయక్ జన్మదిన సందర్భంగా రాష్ట్రంలో ఉన్న ప్రతి జిల్లాలో వివిధ పలు సేవా కార్యక్రమాల ద్వారా ఎంతోమంది నిరుపేదలకు, నిరాశ్రయులకు పండ్లు బ్రెడ్లు, అన్నదానం, రక్తదాన శిబిరం ఇలాంటి ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నారనీ అన్నారు. ఈ ఏడాది వృద్ధాశ్రమంలో వృద్ధులకు నిరుపేదలకు అన్నదాన కార్యక్రమం చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతిభ వయో వృద్ధాశ్రమం నిర్వాహకులు సత్యనారాయణ, జిపిఎస్ నాయకులు కటారి కృష్ణ నాయక్, కాసులు నాయక్, స్వామి నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన డిఎంహెచ్వో.





**ఆంధ్ర ప్రగతి ఆత్మకూరు జూలై 25:** నంద్యాల జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖాధికారి డా ఆర్ వెంకటరమణ ఆత్మకూరు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికముగా తనిఖీ చేయడమైనది. వైద్యాధికారులు మరియు వైద్య ఆరోగ్య సిబ్బంది సమయ పాలన తప్పని సరిగా పాటించవలేనని లేనిచో కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించడమైనది. ఈ తనిఖీ లో భాగముగా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల లోని ఓ పి విభాగాన్ని మరియు అక్కడ వున్నటువంటి రోగులకు,వారికి అందె సేవలు మరియు చికిత్సలు,మందులు, వారి పట్ల వైద్యాధికారి మరియు వైద్య ఆరోగ్యసిబ్బంది ఎలా వ్యవహరిస్తున్నారు మరియు ఓపి విభాగములోని రికార్డులను మరియు రిపోర్టులను తనిఖీ చేయడమైనది. పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రములో జాతీయ ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ కార్యక్రమాల ఐఇసి మెటీరియల్ ప్రదర్శన ను అవగాహన కొరకు ప్రజలకు మరియు రోగులకు అందుబాటులో ఉండే విధముగా ప్రదర్శించవలేనని లేనిచో కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించడమైనది. శివపురం గూడెం గ్రామం లో జరిగే సంచార చికిత్స కార్యక్రమాన్ని ఆకస్మికముగా తనిఖీ చేయడం జరిగినది. సంచార చికిత్స కార్యక్రమములో మందులను మరియు రికార్డులను తనిఖీ చేసి రోగులకు అందె సేవల మీద ఆరా తీయడమైనది. రోగులకు సేవలు అందించడములో ఎటువంటి నిర్లక్ష్యం వహించినచో కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని వైద్యాధికారులకు, సచివాలయ ఆరోగ్య కార్యకర్తలకు మరియు ఆశా కార్యకర్తలకు ఆదేశాలు జారీచేయడమైనది. మరియు శివపురం గూడెం గ్రామములో ఫ్రై డే %-% డ్రై డే కార్యకమాన్ని పర్యవేక్షించడమైనది. ఫ్రై %-% డే మరియు డ్రై డే కార్యక్రమాన్ని పటిష్టంగా అమలుచేయవలేనని లేనిచో కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించడమైనది.మరియు అబ్బా ఐడి జెనరేషన్, పీఎంజేవై పథకాల లబ్ది అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాలని లేనిచో కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించడమైనది. ఎన్సిడి %-% సిడి సర్వే కార్యక్రమాన్ని తనిఖీ చేసి మరియు సర్వే నిర్వహించడం లో నిర్లక్ష్యం వహించినచో కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించడమైనది.

# ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు సీఎం చంద్రబాబు కృషి ఎనలేనిది.

**కర్నూలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు.**



**ఆంధ్ర ప్రగతి కర్నూల్ టౌన్ జులై 25:** అస్తవ్యస్తంగా ఉన్న వ్యవస్థలను మరియు ఆర్థిక వ్యవస్థని బలోపేతం చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారు. తెలుగుదేశంపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కర్నూలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు తెలిపారు.సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికి టిడిపి కార్యక్రమంలో భాగంగా ఈ రోజు కర్నూలు నగరం లోని 26వ వార్డు, లక్ష్మి నగర్ ప్రాంతంలో కర్నూలు నగర పార్టీ అధ్యక్షులు నాగరాజు యాదవ్, రాష్ట్ర సివిల్ కార్పోరేషన్ డైరెక్టర్ కొంకటి లక్ష్మి నారాయణ, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పోరేషన్ డైరెక్టర్ నంద్యాల నాగేంద్ర మరియు స్థానిక నాయకులు, మహిళలతో కలిసి పర్యటించారు.

# ఎమ్మెల్యే భూమా సహకారంతో మౌలిక వసతులు.

**-కుందూరు మోహన్ రెడ్డి**



**ఆంధ్ర ప్రగతి శిరివెళ్ల జులై 25:** సిరివెళ్ల మండల పరిధిలోని గుంపరమానుధిన్నె మజారా విలేజ్ గాంధీనగరంలో "సుపరిపాలనలో తొలి అడుగు" కార్యక్రమంలో టిడిపి నేత కుందూరు మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం గాంధీనగరం లో నిర్వహించగా విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా కుందూరు మోహన్ రెడ్డి గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి సుపరిపాలనలో తొలి అడుగు కర పత్రం పంపించేశారు. ప్రభుత్వము చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు తదితర అంశాలపై ప్రజలకు వివరించారు.గ్రామములో సిమెంట్ రోడ్లు కావాలని కొందరు మహిళలు అడుగగా ఎంఎల్ఏ భూమా అఖిలప్రియ దృష్టికి తీసుకువెళ్లి సిమెంట్ రోడ్లు వేపిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కుందూరు ప్రతాప్ రెడ్డి, కార్యకర్తలు,బూత్ ఇంచార్జీలు పాల్గొన్నారు.

# బీసీ సంక్షేమ హాస్టల్లో నెలకొన్న సమస్యల్ని పరిష్కరించాలి.

**రాయలసీమ విద్యార్థి జేఏసీ నాయకుల డిమాండ్**



**ఆంధ్ర ప్రగతి కర్నూలు జూలై 25:** కర్నూలు జిల్లాలోని బీసీ సంక్షేమ హాస్టల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రాయలసీమ విద్యార్థి జేఏసీ చైర్మన్ కోనేటి వెంకటేశ్వర్లు, బీసీ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ బాబు, అఖిల భారత బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు వాల్మీకి బాలకృష్ణ ల బృందం జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి ప్రసూనకి విద్యార్థి సమస్యలపై వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ" సంక్షేమ హాస్టల్లో లో వసతి కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి హాస్టల్ సీటు కేటాయించాలని, విద్యార్థులకు సన్న బియ్యం ద్వారా భోజనము అందించాలని, ఒక్కో సబ్జెక్టుకు ఒక్కో ట్యూటర్ని ఏర్పాటు చేసి వారికి గౌరవ వేతనం సకాలంలో విడుదల చేయాలని, పెరిగిన మార్కెట్ ధరలకు అనుగుణంగా మెస్ కాస్మోటిక్ చార్జీలను పెంచాలని, ప్రతినెల హాస్టల్ బిల్లును ప్రభుత్వం ఇలాంటి జాప్యం లేకుండా విడుదల చేయాలని, విధులకు సక్రమంగా హాజరు కాకుండా వ్యక్తిగత కార్యకలాపాల్లో బిజీగా ఉన్న వార్డెన్ లపై చర్యలు తీసుకోవాలని, ప్రతి సంక్షేమ హాస్టల్లో విద్యార్థుల భద్రత దృష్ట్యా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ఖాళీగా ఉన్న వర్కర్ల పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని" విద్యార్థి నాయకులు కోరారు.

# చాబోలు గ్రామంలో పి 4 గ్రామసభ నిర్వహణ.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల రూరల్ జూలై 25:** నంద్యాల జిల్లా నంద్యాల మండలంలోని చాబోలు గ్రామంలో గ్రామసభ నిర్వహించడం జరిగింది. గ్రామసభలో పి .ఫోర్ యొక్క కార్య క్రమాలను బంగారు కుటుంబం యొక్క వివరాలను గురించి గ్రామ ప్రజలకు అధికారులు తెలియజేయడం జరిగింది. చాబోలు గ్రామంలో ఇప్పటివరకు మొత్తం 120 బంగారు కుటుంబములు అర్జీలు అధికారులకు అందించడం వల్ల అధికారులు వాటిని అన్నిటిని స్వీకరించడం జరిగింది. అధికారులు ప్రజలు ఇచ్చిన అర్జీలను పరిశీలించి మొత్తం ప్రజలు ఇచ్చిన అర్జీలకు బంగారు కుటుంబంలో వస్తాయని వాటిలో బంగారు కుటుంబాలకు అర్హులందరికీ చాబోలు గ్రామంలో న్యాయం చేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో బంగారు కుటుంబాలకు అర్హులు ఉన్న వారిని గ్రామములోని కొంతమంది నాయకులు కొన్ని కుటుంబాలు దత్తత తీసుకోగ చాబోలు గ్రామంలో మిగిలిన మొత్తం బంగారు కుటుంబాలను మండ్లగుర్రప్ప గారు దత్తత తీసుకొనుటకు సిద్ధంగా ఉన్నట్లు ఆయన తెలియజేయడం జరిగింది. ఈ సభలో అధికారులు గ్రామ ప్రజలు ఉద్యోగులు గ్రామ సర్పంచ్ మౌనిక గారు మరియు పెద్ద ఎత్తున మహిళలు గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగినది.

## బంగారు నెక్లెస్ ను అపహరించిన దొంగ అరెస్టు.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 25:** బంగారు నెక్లెస్ ను అపహరించిన దొంగను నంద్యాల రైల్వే పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే, పెద్దకోట్టాల గ్రామం, నంద్యాల మండలం, నంద్యాల జిల్లాకు చెందిన దూదేకుల మనీషా-దూదేకుల బాబా వలి దంపతులు 20-07-2025 వ తేదిన మధ్యాహ్నం హైదరాబాద్ వెళ్ళుటకు కుటుంబం తో కలిసి నంద్యాల రైల్వే స్టేషన్ కు వచ్చి 17253 గుంటూరు- ఔరంగాబాద్ ఎక్స్ప్రెస్ రైలు ఎక్కే సమయం లో దొంగలు వారి హ్యాండ్ బాగ్ లో ఉండిన 15 గ్రాముల బంగారు నెక్లెస్ గొలుసును దొంగలించినారు. అయితే పై అధికారుల ఆదేశాల మేరకు కేసును నంద్యాల రైల్వే ఎస్సై కె.కుమారి చాలెంజింగ్ గా తీసుకోని కేసు నమోదు చేసిన 3 రోజుల్లోపే పై కేసులో 2 ముద్దాయిలను గుర్తించి తన సిబ్బంది సహాయంతో పట్టుకొని ముద్దాయిలను అరెస్ట్ చేసారు. ముద్దాయిల వద్ద నుండి దొంగలించబడిన మొత్తం 15 గ్రాముల బంగారు నెక్లెస్ గొలుసును రికవరీ చేసారు. చోరి కేసును చేదించి నందుకు ఆ శాఖ ఉన్నతాదికారులు సిబ్బందిని అభినందించారు.

# ప్రభుత్వ సహాయం కోసం రాజు ఎదురుచూపు...

**ఆంధ్ర ప్రగతి కొత్తపల్లి మండలం జులై 25:**
నా పేరు పగిడిమాను రాజు
తండ్రి పేరు చిన్న నీలన్న వయసు 30 సంవత్సరాలు.
ఎదురు పాడు గ్రామం, కొత్తపల్లి మండలం, నంద్యాల జిల్లా పగిడిమాను రాజు నా యొక్క విన్నపము ఏమనగా....నా భార్య పేరు రేణుకమ్మ నాకు ఇద్దరు సంతానం ఒకరు బాబు 8 సంవత్సరాలు, మరొకరు పాప మూడు సంవత్సరాలు. నాకు రెండు సంవత్సరాల క్రితం కృష్ణరావుపేట ,బన్నూరు మధ్యలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ రోడ్డు ప్రమాదంలో నా యొక్క కుడికాలు పూర్తిగా విరిగినది. అప్పటినుండి నేను మంచానికి పరిమితమయ్యాను. రె క్కాడితే కానీ నా కుటుంబం గడవదు. అంతటి దీన పరిస్థితిలో ఉన్నాను. నా భార్య రేణుకమ్మ దినసరి కూలీవలన నన్ను నా పిల్లలను పోషిస్తుంది. నా కుటుంబం చాలా ఇబ్బందిగా ఉన్నది. ఇద్దరు పిల్లలను, నన్ను పోషించడం నా భార్యకు చాలా కష్టంగా ఉన్నది. ఈ మధ్యకాలంలో జూలై నెలలో 11వ తేదీన నా కుమారుడు మా ఊరు ఎదురుపాడు లో ఉన్న ఎంపీయుపి పాఠశాలలో మూడవ తరగతి చదువుతున్న నా కుమారుడు వరుణ్ తేజ ఎనిమిది సంవత్సరాలు పాఠశాల ఆవరణములో తోటి విద్యార్థులతో ఆడుకుంటూ




క్రింద పడ్డాడు. మరుసటి రోజు భుజం నొప్పి అని చెప్పడంతో ఆత్మకూరులోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స చేయించినాము. తరువాత నాటు వైద్యుడి వద్ద భుజానికి కట్టు కట్టించాము, అంతటితో నయం కాకపోతే నందికొట్కూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు వెళ్ళాము. అక్కడ కూడా నయం కాకపోతే మళ్లీ కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకుని వెళ్ళినాము. అయినా కూడా అక్కడ నా కుమారుడికి నయం కాక 15.07.2025 వ తేదీన కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో మధ్యాహ్నం రెండు గంటల సమయంలో నా కుమారుడు వరుణ్ తేజ 8 మరణించాడు. ఈ క్రమంలో మరోసారి నా కుటుంబం కుమారున్ని కోల్పోవడం జరిగింది.
ప్రస్తుతం నా యొక్క కుమారుని దినకర్మలు చేయటానికి కూడా నా దగ్గర డబ్బులు లేవు. దయచేసి ఆర్థిక సహాయం చేయగలరు.
కావున అధికారులు, ప్రజలు, రాజకీయ నాయకులు, వ్యాపారులు, నా కుటుంబానికి మానవత్వంతో సహాయం చేసి నా కుటుంబానికి ఆర్థిక సహాయం చేయగలరని మిమ్ములను అందరినీ వేడుకొనుచున్నాను. దయచేసి దయా హృదయులు మంచి మనసుతో నా కుటుంబానికి ఆర్థిక సహాయం చేయగలరని మీ అందరికీ రెండు చేతులు జోడించి నమస్కరిస్తున్నాను..

**మానవత్వం చాటుదాం, తోటి వారికి సహాయం చేద్దాం. సహాయం చేయదలచిన వారు క్రింది నంబర్కు ఫోన్ పే చేయగలరు..9885632864. నేరేడు పుల్లయ్య.**

# జిల్లాలో పేదరిక నిర్మూలనకు సంపన్నులు ముందుకు రావాలి.

### పేదల బతుకుల్లో వెలుగును నింపేలా పీ4. -జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.








**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూలై 25:**
జిల్లాలో పేదరిక నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కలిసి ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ జి రాజకుమారి పేర్కొన్నారు. శుక్రవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుగారు అమరావతి సచివాలయం నుంచి పీ4పై జిల్లా కలెక్టర్లు, ఎమ్మెల్యేలతో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నంద్యాల కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి, జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్, జిల్లాధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి రాజకుమారి మాట్లాడుతూ.... నంద్యాల జిల్లాలో పేదరిక నిర్మూలనకు సంపన్నులందరూ ముందుకు వచ్చి బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలన్నారు. నంద్యాల జిల్లాలో చాలామంది సంపన్నులు ఉన్నారని వారందరూ ముందుకు వచ్చి జిల్లాకు కేటాయించిన లక్ష్యాన్ని అధిగమించేందుకు కృషి చేయాలన్నారు. పీ4 కార్యక్రమం ప్రజా ఉద్యమంలా సాగుతోందని, పేద కుటుంబాల సాధికారతే ప్రభుత్వ లక్ష్యమని దీనిని విజయవంతం చేసేందుకు అత్యుత్తమ విధానాలను జిల్లా అంతట అమలు చేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలో కార్పొరేట్ సంస్థలు కూడా కలిసి వచ్చేలా చూడాలన్నారు. అధికారులు గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని ఆ ప్రాంతానికి చెందిన ఎన్నారైలు, పారిశ్రామికవేత్తలు స్థానిక బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా చూడాలన్నారు. బంగారు కుటుంబాల అత్యంత ప్రాధాన్యతలపై చేపట్టిన సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.
గ్రామ, వార్డు సచివాలయ స్థాయిలో బంగారు కుటుంబాలు, మార్గదర్శుల వివరాలు సరిగ్గా నమోదు చేసినప్పుడే ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందన్నారు. ఆగస్ట్ 15 నాటికి జిల్లాలో బంగారు కుటుంబాలను 'మార్గదర్శులు' దత్తత తీసుకునే కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు సంకల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 250 బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవడం జరిగిందని ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రివర్యులను ఆదర్శంగా తీసుకొని జిల్లాలోని సంపన్నులందరు బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇకనుంచి అధికారులు పి-4, కార్యక్రమాన్ని సీరియస్ గా తీసుకొని జిల్లాకు ఇచ్చిన లక్ష్యాన్ని అధిగమించేందుకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా పి 4, లక్షసాధన కొరకు అధికారులకు కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు.

# కంపమళ్ళ గ్రామంలో రాత్రిబస, పల్లె నిద్ర, కార్యక్రమం ఏర్పాటు.

### ఇన్స్పెక్టర్ హనుమంత్ నాయక్.






**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా క్రైమ్ జూలై 25:** నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాలమేరకు ఆళ్లగడ్డ సబ్ డివిజన్ డిఎస్పి ప్రమోద్ సూచనలతో సబ్ డివిజన్ పోలీసు అధికారులు ఆయా సమస్యాత్మక గ్రామాలలో రాత్రి బస , పల్లె నిద్ర ,కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కోవెలకుంట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని కంపమళ్ళ ఫ్యాక్షన్ గ్రామంలో నేడు కోయిలకుంట్ల ఇన్స్పెక్టర్ హనుమంతు నాయక్ మరియు సబ్ ఇన్స్పెక్టర్ మల్లికార్జున రెడ్డి గారి ఆధ్వర్యంలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడి గ్రామ పరిస్థితులను పై ఆరాదీశారు ప్రస్తుత పరిస్థితులపై గ్రామ ప్రజలతో అడిగి తెలుసుకున్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల పట్ల కఠిన చర్యలు తీసుకుంటామని, ఎవరైనా గొడవలకు పాల్పడినా, అసాంఘిక కార్యకలాపాలకు జోలికెళ్లినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. అనంతరం చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళలపై జరిగే అఘాయిత్యాలు, రోడ్డు ప్రమాదాలు, బాలబాలికల పై జరిగే నేరాలపై అవగాహన కల్పించారు, సైబర్ మోసాల బారిన పడకూడదని, గంజాయి మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల జరిగే అనార్థాల గురించి తెలియజేశారు. అపరిచితుల కాల్స్ మరియు లింకులు క్లిక్ చేయరాదని, బ్యాంకు ఖాతాల ఓటిపిలు ఎవరికి చెప్పకూడదని మోసపూరిత ఏపీకే ఫైల్ పై ప్రజలకు అవగాహన చేస్తున్నారు. ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే 1930 కి కాల్ చేసి సమాచారం అందించాలని ప్రజలకు వివరించారు.
రోడ్డు భద్రతా నిబంధనలను పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని ప్రజలకు అవగాహన చేశారు. గ్రామాలలో ఏలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చూసుకునే భాద్యత పోలీసు అధికారులకు ఉంటుందని, అందుకోసం గ్రామాలలోని ప్రజలు తమ వంతు భాద్యతగా ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు గ్రామాలలోని యువత, ప్రజలు పోలీసులకు సహకరించాలని సూచించారు. మహిళల భద్రత కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు.

# భాగవతం అమృత భాండం.

### డాక్టర్ మల్లు వేంకట రెడ్డి, తితిదే.

### నందికుంటలో ఘనంగా ముగిసిన తితిదే ధార్మిక కార్యక్రమాలు.

**ఆంధ్రప్రగతి ఆత్మకూరు జూలై 25:**
భాగవతం మనిషికి అమృతత్వాన్ని ప్రసాదించే ఒక అమృత భాండమని, జీవితాన్ని ఎలా ఆనందమయంగా మలుచుకోవాలో నేర్పుతుందని, సృష్టిలోని అన్ని విషయాలు భాగవతం చదవడం వలన, వినడం వలన తెలుసుకోవచ్చునని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకట రెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో కొత్తపల్లి మండలం, నందికుంట గ్రామంలోని పురాతన నందీశ్వరాలయం నందు గత



నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సంస్కృతిక కార్యక్రమాల ముగింపు సందర్భంగా గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలా నంతరం జరిగిన ధార్మిక సభలో వారు ప్రసంగించారు. గత మూడు రోజులపాటు ఇస్కాన్ ధర్మ ప్రచారకులు కీర్తి రాజదాసు శ్రీమద్రామాయణం, మహాభారతం, భగవద్గీతలపై చేసిన ప్రవచనాలు భక్తులను ఎంతగానో అలరించాయి. అర్చకులు బాణాల లక్ష్మీనారాయణాచార్యులు మాతృమూర్తులందరితో



గోపూజ, కుంకుమార్చన చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పైరెడ్డి నిత్యలక్ష్మి, నారాయణరెడ్డి, గ్రామ పెద్దలు టి.మధుసూదన రెడ్డి, స్థానిక భజన బృందం సభ్యులు నారాయణ, శివన్న, పుల్లయ్య, దత్తు శివన్న, మహేష్, ప్రవీణ్, హేమంత్ సాయి, బాణ రామిరెడ్డితో పాటు స్థానిక భక్తులు పాల్గొన్నారు. ప్రతిరోజు కార్యక్రమాల ప్రారంభానికి ముందుగా గ్రామంలో హరినామ సంకీర్తన నిర్వహించారు.

# డయేరియా పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

### సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫీ.



పి. మహమ్మద్ రఫీ,సామాజిక కార్యకర్త, డోన్.

**ఆంధ్ర ప్రగతి డోన్ జూలై 25:** అతిసార వ్యాధి వైరస్ లు మరియు బ్యాక్టీరియా, పరాన్న జీవుల వల్ల సంక్రమిస్తుంది. వర్షాకాలంలో కలుషితమైన నీరు, ఆహారం, నిల్వ ఉన్న ఆహార పదార్థాలు తినడం వల్ల అతిసార వ్యాధి సమస్యలు వస్తాయని వైద్య నిపుణులు తెలియజేస్తున్నారని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి తెలిపారు. కావున ప్రతి ఒక్కరు అవగాహనతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, అతిసార వ్యాధిపట్ల జాగ్రత్త తీసుకోవాలన్నారు. లక్షణాలు:- వాంతులు, విరేచనాలు ,కడుపునొప్పి, పొత్తి కడుపు పిండెసినట్లుండుట, దాహం మరియు నోరు ఎండిపోవడం వీటితోపాటు ఇతర లక్షణాలు కూడా కలిగి ఉండవచ్చు. ఇలాంటి లక్షణాలు కనబడిన వెంటనే వైద్య నిపుణులను సంప్రదించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి తెలిపారు. జాగ్రత్తలు:- మూత్ర, మలవిసర్జనల తరువాత, అన్నం తినే ముందు శుభ్రంగా చేతులు కడుక్కోవాలి. కాచి చల్లార్చిన నీరు త్రాగాలి. వేడివేడి ఆహార పదార్థాలు తినాలి. ఆహార పదార్థాలపై మూతలు ఉంచాలి. వ్యక్తిగత శుభ్రత, పరిసరాల శుభ్రత చాలా ముఖ్యం. రోడ్ల పక్కన ఉండే ఆహారం తినకపోవడం మంచిది. కావున తగిన జాగ్రత్తలతో ఆరోగ్యాన్నికాపాడుకోవాలనిసామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి తెలిపారు.


# ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వంవిఫలం

### మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి.

**ఆంధ్ర ప్రగతి రుద్రవరం జూలై 25:**
ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వము పూర్తిగా విఫలమైందని ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి విమర్శించారు. శుక్రవారం
మండలంలోని ఆలమూరు, మందలూరు గ్రామాలలో బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం వీర రాఘవరెడ్డి, ఎంపీపీ మబ్బు బాలస్వామి, వైయస్సార్సీపి మండల కన్వీనర్ ప్రసాద్ రెడ్డి,నాయకులు పాణ్యం చంద్ర, పాణ్యం నాగేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్భంగా ఆళ్లగడ్డ మాజీ శాసనసభ్యులు గంగుల



బ్రిజేంద్రారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లడం కోసమే బాబు షూరిటీ మోసం గ్యారంటీ విస్తృత స్థాయిలో ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. త్వరలో చేపట్టే ఈ కార్యక్రమంలో మండలంలోని ప్రతి వైఎస్ఆర్సిపి శ్రేణులు కలిసి ప్రతి గడపకు వెళ్లి కూటమి ప్రభుత్వం మోసాలను ప్రజలకు అర్థమయ్యేలా తెలియజేయాలన్నారు. ఎన్నికల ముందు హామీలు ఇచ్చి అధికారంలోకి రాగానే ప్రజలను నిలువునా ముంచారని ఆయన మండిపడ్డారు అదే



విధంగా రైతులకు రైతు భరోసా ఇవ్వకుండా ప్రతి రైతుకు కూటమి ప్రభుత్వం భా కి పడిందని అన్నారు. కనుక వారు చేసిన మోసాలను ప్రజల దృష్టికి తీసుకువెళ్లి వచ్చే 2029ఎన్నికల్లో మన ప్రియతమ నాయకుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకునే బాధ్యత వైసీపీ శ్రేణులదే అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు హరి నారాయణ, నాగేశ్వర రెడ్డి, మాధవ్ గౌడ్, సూలం ప్రభాకర్, నరసింహయ్య శెట్టి, జయరాముడు, మందలూరు శ్రీనివాసరెడ్డి, వీర శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా ప్రపంచ దినోత్సవం

### పోస్టర్ విడుదల చేసిన జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్



**కర్నూలు ఆంధ్ర ప్రగతి జూలై 25):** పిల్లల హక్కులకు ప్రాధాన్యత మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా ప్రతి సంవత్సరం నిర్వహించబడే ప్రపంచ దినోత్సవాన్ని పురస్కరించుకుని, కర్నూలులో కోనేర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో "జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్" కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా జిల్లా సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఈ దినోత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు న్యాయ పరమైన హక్కులు చాలా ముఖ్యం. బాల కార్మికులు, బాల్య వివాహాలు, పిల్లల అక్రమ రవాణా, బాల భిక్షాటన వంటి సమస్యలను సమూలంగా నిర్మూలించాల్సిన అవసరం ఉంది అని పేర్కొన్నారు. ప్రజలు ఈ తరహా ఘటనలను గమనిస్తే, వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098, లేదా 112, 100 వంటి టోల్ ఫ్రీ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. పిల్లలకు రక్షణ, సంరక్షణ కల్పించేందుకు పోలీసులు సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు. పిల్లల హక్కుల కోసం పనిచేస్తున్న జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ బృంద సేవలను ప్రశంసించిన జిల్లా ఎస్ పి, తక్షణమే ఎఫ్ఐఆర్‌లు, జీడీలు నమోదు చేయాలని పోలీసులకు సూచించారు. ఈ భాగస్వామ్యంతో పోలీసు శాఖతో సమన్వయం బలపడినట్టు, పిల్లల రక్షణ వ్యవస్థ మరింత సమర్థవంతంగా మారుతోందని వ్యాఖ్యానించారు. అక్రమ రవాణాను పూర్తిగా నిర్మూలించేందుకు జనజాగరణ కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. పిల్లల అక్రమ రవాణాలో పాల్గొనే వారికి కఠిన శిక్షలు విధించబడతాయని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాలల సంక్షేమ సమితి సభ్యుడు మధు సుధాకర్, జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ జిల్లా కోఆర్డినేటర్ మౌనిక, ఏరియా కోఆర్డినేటర్ ముని స్వామి, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా కోఆర్డినేటర్ సుంకన్న, మరియు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# 27వ తేదీ నంద్యాలలో రాయలసీమ స్థాయి వైద్య వైజ్ఞానిక సదస్సు.

**రాష్ట్ర ఐఎంఏ, ఏపీ మెడికల్ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో.నిర్వహణ మంత్రి ఫరూక్ తో సదస్సు ప్రారంభం.**

**ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి, వైద్య విశ్వవిద్యాలయ వైస్ ఛాన్స్ లర్ డాక్టర్ చంద్రశేఖర్, ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ శ్రీహరి రావు పాల్గొంటారు.**

**సదస్సులో పాల్గొనడానికి ప్రతినిధులుగా నమోదు చేసుకున్న 700 మంది వైద్యులు.**

**12 మంది వివిధ రంగాల వైద్య నిపుణుల ప్రసంగాలు.**




వైద్య వైజ్ఞానిక సదస్సు సైంటిఫిక్ ప్రోగ్రాం బ్రోచర్ విడుదల చేస్తున్న ఐఎంఏ నాయకులు.



పాత్రికేయ సమావేశంలో ప్రాంతీయ వైద్య వైజ్ఞానిక సదస్సు వివరాలు తెలియజేస్తున్న నిర్వాహక కమిటీ చైర్మన్ డాక్టర్ రవి కృష్ణ

**ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ జూలై 25:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో, నంద్యాల ఐఎంఏ నిర్వహణలో ఈ నెల 27వ తేదీ ఆదివారం నంద్యాలలో సౌజన్య కన్వెన్షన్ సెంటర్లో రాయలసీమ, నెల్లూరు జిల్లాలతో కూడిన ఐఎంఏ జోన్ 3 ప్రాంతీయ వైద్య వైజ్ఞానిక సదస్సు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మధు మణి సమావేశ భవనంలో నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో సదస్సు నిర్వాహక చైర్మన్ డాక్టర్ రవి కృష్ణ, నిర్వాహక కార్యదర్శి డాక్టర్ మధుసూదన్ రెడ్డి, ఐఎంఏ నంద్యాల అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ మధుసూదనరావు, డాక్టర్ పనిల్ కుమార్, సదస్సు వైజ్ఞానిక కమిటీ చైర్మన్ డాక్టర్ అనిల్ కుమార్, వైజ్ఞానిక కమిటీ కార్యదర్శి, రాష్ట్ర ఐఎంఏ ఉపాధ్యక్షులు డాక్టర్ విజయభాస్కర రెడ్డి సదస్సు వివరాలు తెలిపారు. ఆదివారం ఉదయం 11 గంటలకు ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జి.నందకిషోర్ అధ్యక్షతన జరిగే ఈ సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమం లో రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ముఖ్య అతిథిగా పాల్గొని సదస్సు ప్రారంభిస్తారు. గౌరవ అతిథులుగా నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు నరసింహారెడ్డి, డాక్టర్ ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయ వైస్ ఛాన్స్ లర్ డాక్టర్ చంద్రశేఖర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ దగ్గుమాటి శ్రీహరి రావు, రాష్ట్ర వివిధ ప్రాంతాల నుండి వచ్చే ఐఎంఏ జాతీయ, రాష్ట్ర నాయకులు పాల్గొంటారని తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరిగే వైద్య వైజ్ఞానిక సదస్సులో 12 మంది వివిధ వైద్య రంగాలకు చెందిన నిపుణులు వివిధ అంశాలపై మల్టీమీడియా సహకారంతో ఉపన్యాసాలు ఇవ్వడం జరుగుతుంది. రాయలసీమ లోని కర్నూలు అనంతపురం, కడప, చిత్తూరు ఉమ్మడి జిల్లాలతో పాటు నెల్లూరు జిల్లా నుంచి 700 మంది వైద్యులు సదస్సులో పాల్గొనడానికి ప్రతినిధులుగా నమోదు చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ వైద్యులు ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి మెడికల్ కౌన్సిల్ లో తమ రిజిస్ట్రేషన్ రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుందని ఆ సమయంలో నిరంతర వైద్య విద్య పాయింట్లు సంవత్సరానికి ఆరు చొప్పున 30 పాయింట్ల సర్టిఫికెట్స్ జతపరచవలసి ఉంటుందన్నారు. ఈ సదస్సుకు హాజరైన వారికి ఏపీ మెడికల్ కౌన్సిల్ రెండు పాయింట్ల సర్టిఫికెట్ ను అందజేస్తారని తెలిపారు. వైద్యంలో వస్తున్న ఆధునిక విధానాల పట్ల, నూతన పరికరాల పట్ల వైద్యులు నిరంతరం అవగాహన పెంచుకోవడం ద్వారా ప్రజలకు మెరుగైన, నాణ్యమైన ఆధునిక చికిత్సలు అందించడానికి ఆస్కారం ఏర్పడుతుందన్నారు. ఈ వైద్య వైజ్ఞానిక సదస్సుల నిర్వహణ ప్రధాన ఉద్దేశం ఇదే అని తెలిపారు. సదస్సుకు ఏపీ మెడికల్ కౌన్సిల్ పరిశీలకులుగా శాంతిరాం వైద్య కళాశాల మైక్రోబయాలజీ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీదేవిని మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ శ్రీహరి రావు నియమించారు.


**సదస్సులో ప్రసంగిస్తున్న వైద్య నిపుణులు:**

ఒమేగా క్యాన్సర్ ఆసుపత్రి క్యాన్సర్ నిపుణులు డాక్టర్ రవీంద్ర, అపోలో ఆసుపత్రి న్యూరో ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్ డాక్టర్ సురేష్, హైదరాబాద్ యశోద ఆసుపత్రి హెమటాలజీ నిపుణులు డాక్టర్ అశోక్, యశోద ఆసుపత్రి క్రిటికల్ కేర్ శాకాధిపతి డాక్టర్ మిశ్రా, అపోలో ఆసుపత్రి న్యూరో సర్జన్ డాక్టర్ ధనుంజయ రావు,శాంతిరాం వైద్య కళాశాల మైక్రో బయాలజీ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీదేవి,కర్నూలు విశ్వభారతి వైద్య కళాశాల సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ బి.జి.రాహుల్, నంద్యాల ఉదయానంద ఆసుపత్రి గుండె వైద్య నిపుణులు డాక్టర్ రామేశ్వర్ రెడ్డి, నంద్యాల మధుమణి చెవి ముక్కు గొంతు శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ చిత్తలూరి మణిదీప్, శాంతిరాం వైద్య కళాశాల ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ హర్షవర్ధన్ రెడ్డి సదస్సులో వివిధ అంశాలపై ప్రసంగిస్తారు.

# ఘనంగా ప్రపంచ ఐ వి ఎఫ్ దినోత్సవం.

**సంతానలేమికి ఐవీఎఫ్ గొప్ప వరం: డాక్టర్ అరుణకుమారి.**

**కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ రవి కృష్ణ, డాక్టర్ సహదేవుడు, డాక్టర్ మధుసూదన్ రావు.**



ప్రపంచ ఐ వి ఎఫ్ దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న మహిళా వైద్యులు




సమావేశంలో ప్రసంగిస్తున్న డాక్టర్ అరుణ కుమారి.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ జూలై 25:**

శుక్రవారం "ప్రపంచ ఐ.వి.ఎఫ్. ( టెస్ట్ ట్యూబ్ బేబీ) దినోత్సవం", పద్మావతి నగర్ లో ఉన్న నెరవాటి ఆసుపత్రి ఆవరణలో నంద్యాల ఐఎంఏ మిషన్ పింక్ హెల్త్ విభాగం ఆధ్వర్యంలో, నెరవాటి సంతాన సాఫల్య కేంద్ర వైద్యురాలు, ఐఎంఏ నంద్యాల మిషన్ పింక్ హెల్త్ అధ్యక్షురాలు డాక్టర్ అరుణకుమారి నిర్వహణలో ఘనంగా నిర్వహించారు.ఐఎంఏ నంద్యాల మిషన్ పింక్ హెల్త్ గౌరవ అధ్యక్షురాలు డాక్టర్ నాగమణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, నంద్యాల ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ మధుసూదన రావు, నంద్యాల ఐఎంఏ మాజీ అధ్యక్షులు డాక్టర్ సహదేవుడు, డాక్టర్ నెరవాటి వినోద్ విశిష్ట అతిథులుగా పాల్గొని ప్రసంగించారు.

డాక్టర్ అరుణకుమారి మాట్లాడుతూ వేగంగా మారుతున్న ప్రపంచీకరణ నేపద్యంలో,ఆలస్యంగా వివాహాలు చేసుకోవడం, పని వేళలు మారడం, ధూమ ,మద్యపానం, పని ఒత్తిడి వంటి వివిధ కారణాలు దంపతులలో సంతానలేమి కి దారి తీస్తున్నాయని, టెస్ట్ ట్యూబ్ బేబీ (ఐ వి ఎఫ్ విధానం) కనిపెట్టడం సంతానలేమి తో బాధపడుతున్న దంపతులకు ఒక గొప్ప వరంగా పరిణమించిందన్నారు .గతంలో నగరాలలో మాత్రమే ఉండే ఈ సదుపాయం ఈరోజు నంద్యాల పట్టణంలో కూడా అందుబాటులోకి రావడం జరిగిందని ఇప్పటికే అనేక మంది దంపతులు ఈ విధానం ద్వారా పిల్లలు కనడం జరిగిందన్నారు.డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వానికి ఇటీవల జనాభా పై నిపుణుల అధ్యయన కమిటీ ఇచ్చిన ప్రతిపాదనలలో జనాభా అధికం చేయాల్సిన అవసరం, అందుకు అనుగుణమైనటువంటి ప్రోత్సాహకాలు ఇవ్వాలని ప్రతిపాదించిందని , అదేవిధంగా పేద దంపతులకు సంతాన లేమి ఉన్న పక్షంలో ఆర్థిక సహకారం ప్రభుత్వం ద్వారా అందించడం ద్వారా ఐవీఎఫ్ విధానంలో సంతానం పొందే అవకాశం కల్పించాలని కూడా కమిటీ సూచించారని తెలిపారు.భవిష్యత్తులో మానవ వనరులే దేశ సంపదగా మారనున్నాయని అన్నారు.కార్యక్రమంలో డాక్టర్ అరుణకుమారి, డాక్టర్ నెరవాటి వినోద్ కుమార్, డాక్టర్ నాగమణి, డాక్టర్ కల్పన, డాక్టర్ నర్మద, డాక్టర్ నాగరేఖ, డాక్టర్ మాధవి, డాక్టర్ రజని, డాక్టర్ సునీత,డాక్టర్ అరిఫా భాను, డాక్టర్ తనూజ, డాక్టర్ ఫాతిమా, డాక్టర్ రాధిక, డాక్టర్ సుసుమ, డాక్టర్ చంద్రకళ, ఆసుపత్రి సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

## ప్రేమ పేరుతో చెంచు గిరిజన మహిళను

# మోసం చేసిన ఆటోడ్రైవర్.

**వివాహం చేసుకోకుండానే సహజీవనం.**

**పండంటి మగ బిడ్డను జన్మనిచ్చిన తర్వాత వెలివేసిన భర్త,అత్త,మామలు.**

**దిక్కుతోచని స్థితిలో చెంచు గిరిజన మహిళ భూమని ఈరమ్మ.**

**సంబంధించిన ఐటీడీఏ అధికారులు ఈరమ్మకు తగిన సహాయం చేసి,ఆదుకోవాలని మనవి.**


**జవహర్ నాయక్ గిరిజన సంక్షేమ సంఘం నాయకులు.**



**ఆంధ్ర ప్రగతి ఆత్మకూరు జూలై 25:** నంద్యాల జిల్లా,ఆత్మకూరు మండలం,కొట్టాలచెరువు చెంచుగూడెంకు చెందిన భూమని నాగమ్మ ఈరన్న దంపతుల కూతురు భూమని ఈరమ్మ 2023వ సంవత్సరంలో కర్నూలు పట్టణంలోని కె.వి.ఆర్ కాలేజీలో బీ.కామ్.. సి.ఎ చదువుతున్నప్పుడు నంద్యాల పట్టణానికి చెందిన ఆటో డ్రైవర్ పఠాన్ దస్తగిరి కాలేజీ దగ్గరికి పోయి ప్రేమ పేరుతో మాయ మాటలు చెప్పి తీసుకొని పోయి వివాహం చేసుకోకుండా,సహజీవనం చేయటం జరిగింది.ఈరమ్మ 2025వ సంవత్సరం జనవరి నెలలో పండంటి మగ బిడ్డను జన్మనివ్వడం జరిగింది.ఈరమ్మ భర్త పఠాన్ దస్తగిరి,మరియు అతని తల్లిదండ్రులు నీవు చెంచు దానివి వద్దు అని వెలివేయడం జరిగింది. ఈరమ్మ తల్లికి మతి స్థిమితం లేదు,తండ్రి చనిపోయాడు.ఉన్న రెండు ఎకరాల పొలం నల్ల కాలువ గ్రామానికి చెందిన న్యామతుల్లా ఆక్రమించుకోవడం జరిగింది.అటు తల్లిదండ్రులు ఇటు భర్త దూరం కావడంతో చంటి బిడ్డను తీసుకొని దిక్కుతోచని స్థితిలో భూమని ఈరమ్మ ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ హాస్పిటల్ దగ్గర గత 4 రోజుల నుంచి ఉంది.సంబంధించిన ఐటీడీఏ అధికారులు భూమని ఈరమ్మకు తగిన సహాయం చేసి, ఆదుకోవాలని పోతున్నారు.

## హరిహర వీరమల్లు కథపై ప్రజలకు వాస్తవాలు చెప్పాలి.

**-వి.శ్రీనివాసరావుసిపిఎం రాష్ట్ర కార్యదర్శి.**



**ఆంధ్ర ప్రగతి అమరావతి జూలై 25:**

చారిత్రక ఆధారాలు లేని కాల్పనిక కథ 'హరిహర వీరమల్లు' సినిమాపై ప్రజలకు వాస్తవాలు చెప్పాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ఈ సినిమా హీరో, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు ఈ మేరకు గురువారం ఒక లేఖ రాశారు." మీరు ప్రముఖ పాత్రలో నటించి విడుదల చేసిన 'హరిహర వీరముల్లు' చిత్రం చారిత్రక వాస్తవాలపై ఆధారపడి కాకుండా ఊహాజనితమైన కాల్పనిక కథతో తీశారు. కానీ మీ అభిమానులు, ప్రజలు దీన్ని ఒక చారిత్రక ఘట్టంగా భావిస్తున్నారు. అపోహలతో కూడిన ఈ ఊహజనిత చిత్రం ముస్లిం వ్యతిరేక విద్వేషాలు పెరగటానికి దారి తీస్తుంది. ఇది జాతీయ ఐక్యత, సమగ్రతలకు ఏమాత్రం తోడ్పడే విషయం కాదు. కావున ఈ చిత్రం కాల్పనిక కట్టు కథ అని మీరు ప్రజలకు స్పష్టం చేయాలని కోరుతున్నాను. బాధ్యతాయుతమైన రాజకీయ హోదాలో ఉన్న మీరు ప్రజలకు వాస్తవాలు చెప్పాల్సిన బాధ్యత మీపై ఉంది.'హరిహర వీరమల్లు' పాత్రకు ఎలాంటి చారిత్రక ఆధారాలు లేవు. ఇది ఒక ఫాంటసీ సఅష్టి మాత్రమే. దీనితో ముడిపడి ఉన్న మొఘల్ సామ్రాజ్యం, కోహినూర్ వజ్రం లాంటివి వాస్తవాలు, వాస్తవాలకు కట్టు కథలను జోడించడం వల్ల ప్రజలకు చరిత్రపై అపోహలు ఏర్పడతాయి.కృష్ణానది పరివాహ ప్రాంతంలో లభించిన కోహినూర్ వజ్రం అనాడు (దాదాపు 700 సంవత్సరాల క్రితం) కాకతీయుల సామ్రాజ్యానికి చేరింది. ఆ తర్వాత ఢిల్లీ సుల్తానులకు, వారి నుండి మొగల్ చక్రవర్తులకు వారి నుండి నాదిర్ షాకు, వారి నుండి ఆఫ్ఘనిస్తాన్ రాజులకు, వారి నుండి పంజాబ్ సిక్కు రాజుకు, అక్కడినుండి బ్రిటిష్ వారికి అది లభించింది. బ్రిటిష్ వారు దానిని దొంగతనంగా లండన్ తరలించారు. ఇది చరిత్ర చెబుతున్న వాస్తవం. ఇంతవరకు అది తిరిగి భారతదేశానికి రాలేదు. అయితే, మీ సినిమాలో బ్రిటిష్ వారి పాత్ర గురించి మీరు ఎలాంటి ప్రస్తావన చేయకపోవడం దురదృష్టకరం.మొఘలుల కాలంలో సృష్టించిన సంపద వారి తదనంతరం కూడా ఇక్కడే ఉండిపోయింది. వారు భారతదేశంలో, అంతర్భాగం అయిపోయారు. కానీ బ్రిటిష్ వాళ్ళ కాలంలో సృష్టించిన మన సంపద తరలిపోయింది. యావన్మంది ప్రజలు ఒక్క తాటి పైకి వచ్చి పోరాడి స్వాతంత్ర్యం సాధించుకున్నాము. బ్రిటీష్ వాళ్ళు హిందూ ముస్లిం ఘర్షణలు సృష్టించి దేశాన్ని విభజించి వెళ్ళి పోయారు. ఈ చారిత్రిక వాస్తవాన్ని కూడా మీరు గుర్తించడం అవసరం.మీరు ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో అత్యంత పలుకుబడి కలిగిన స్థానంలో ఉన్నారు. గత 11 సంవత్సరాలుగా దేశభక్తి గురించి మాట్లాడుతున్న మోడీ ప్రభుత్వం%ౌ% కోహినూర్ వజ్రాన్ని తిరిగి భారతదేశానికి రప్పించడానికి ఎలాంటి ప్రయత్నం చేయలేదు. ఇప్పటికైనా మీరు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, లండన్ లో ఉన్న కోహినూర్ వజ్రాన్ని తిరిగి భారతదేశానికి రప్పించగలిగితే ప్రజలు సంతోషిస్తారు. అది మన వారసత్వ సంపద. ఆ పని చేయకుండా కట్టుకథలతో ప్రజల్లో మత విద్వేషాలు రగిలిస్తే అది దేశానికి , ప్రజలకు నష్టమని గుర్తించాలి" అని వి.శ్రీనివాసరావు తన లేఖలో పేర్కొన్నారు.

# జయన్నను కొట్టి చంపిన గొల్ల మహేష్ ను అరెస్ట్ చేయాలి.

## -జాతీయ మాల మహానాడు డిమాండ్.

**ఆంధ్ర ప్రగతి ఆత్మకూరు జులై 25:**

నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలం కరివేన గ్రామ నివాసి బరిగెల జయన్నను దుద్యాల పొలిమేరలో ఉన్న తమ పొలంలో 06.05.2025 తేదిన పని చేసుకుంటున్న బరిగెల జయన్నను తన భార్య జయమ్మ కళ్ళ ముందే గొల్ల మహేష్ బలంగా ఎదపై కొట్టి చంపాడనీ తన తల్లి బరిగెల జయమ్మ సూచన మేరకు రెండవ కూతురు బరిగెల అరుణజ్యోతి 28.05.2025న ఆత్మకూరు పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేయడం తో పాటు 29.05.2025 తేదిన రిజిస్టర్డ్ పోస్టు ద్వారా కూడా పిర్యాదు చేసినట్లు నంద్యాలలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బరిగెల అరుణజ్యోతి తెలిపారు. తమ తండ్రి చనిపోయి అమ్మకు తోడుగా తాము ఇద్దరు ఆడపిల్లలు అరుణ జ్యోతి, ప్రసన్న కుమారి మాత్రమే ఉన్నామని తమకు గ్రామంలో ఏ ఒక్కరు సహకరించడం లేదని, పోలీసులు కూడా కేసు కట్టకుండా, నిందితుడికి అన్ని విధాలా సహకరిస్తూ, కేసును నీరు కార్చే ప్రయత్నం చేస్తున్నారని, పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ చూపి తమ కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. బరిగెల అరుణజ్యోతి మాట్లాడుతూ తమ పిర్యాదుపై కేసు నమోదు చేయకుండానే 29.05.2025 తేది నుండే గొల్ల మహేష్ ను కస్టడి లోకి తీసుకొని 30.05.2025 తేదిన బరిగెల జయన్నను చంపిన స్థలంలో విచారణ ఉంటుందని, కుటుంబ సభ్యులు హాజరు కావాలని ఆత్మకూరు డిఎస్పి రామంజి నాయక్ మరియు సిఐ రాము ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా 30.05.2025 తేదిన సుమారు 12 గంటల సమయంలో మహిళా కానిస్టేబుల్ లేకుండానే తన తండ్రి బరిగెల జయన్నను చంపిన స్థలంలో గొల్ల మహేష్ ను తమ కస్టడిలో ఉంచుకొని, తన వెంట తీసుకొని వచ్చి అతని ముందే తన బృందం తో వీడియో రికార్డింగ్ చేయిస్తూ విచారణ చేపట్టి, అమ్మ బరిగెల జయమ్మ చేత ఫ్రెష్ గా పిర్యాదు చేస్తే కేసు



కట్టించి కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని ఆత్మకూరు డిఎస్పి రామంజి నాయక్ మరియు సిఐ రాము చెప్పడం జరిగిందని తెలిపారు. తదుపరి ఆత్మకూరు పోలీస్ స్టేషన్ వెళ్లగా, అక్కడ పలుమార్లు పిర్యాదులు వ్రాయిస్తూ, మార్పులు చేస్తూ మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల దాకా స్టేషన్ లో కూర్చోబెట్టి కేసు నమోదు చేయకుండా కాలయాపన చేస్తూ, తదుపరి ఏమి డీల్ జరిగిందో రెండు రోజులుగా తమ కస్టడి లో ఉంచుకున్న గొల్ల మహేష్ ను ఆత్మకూరు సిఐ రాము వదలి వేశారని ఆరోపించారు.

ఆత్మకూరు పోలీసులు ఎలాంటి కేసు నమోదు చేయకపోవడంపై 02.06.2025 తేదిన జిల్లా పోలీస్ అధికారి, నంద్యాల వారికి చేసిన పిర్యాదు చేసినట్లు తెలిపారు. వారు కూడా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ఆత్మకూరు పోలీస్ స్టేషన్ కు జిల్లా పోలీస్ కార్యాలయానికి తాము చేసిన పిర్యాదులపై ఏ విధమైన చర్యలు తీసుకున్నారో తెలియజేయాలని, 09.06.2025 తేదీన సమాచార హక్కు చట్టం 2005, సెక్షన్ 6 (1) ద్వారా సమాచారం కోసం దరఖాస్తు చేసినట్లు బరిగెల అరుణ జ్యోతి తెలిపారు.

ఆత్మకూరు సిఐ రాము ఆత్మకూరు పోలీస్ స్టేషన్ కు ఎటువంటి పిర్యాదులు అందలేదని, అంతేకాకుండా స్టేషన్ సిసిటివిలు పనిచేయడం లేదని వర్షం మరియు కోతుల తీగలు తెంచి వేసిన కారణంగా రికార్డు కాలేదని పుటేజ్ ఇవ్వలేమని లిఖితపూర్వకంగా తెలియజేసినట్లు తెలిపారు. ఈ తతంగం అంతా చూస్తే గొల్ల మహేష్ ను రక్షించేందుకు, కేసును నీరు కార్చేందుకు ఆత్మకూరు పోలీసులు, సిఐ రాము, డిఎస్పి రామాంజి నాయక్ లు కలిసి అధికార దుర్వినియగానికి పాల్పడుచున్నారని భావించి గౌరవ జిల్లా పోలీస్ అధికారి, నంద్యాల వారి కార్యాలయానికి 08.07.2025న సమాచార హక్కు చట్టం 2005, సెక్షన్ 19 (1) ద్వారా సమాచారం కోసం అప్పీలు చేయడం జరిగిందని తెలిపారు.

గౌరవ జిల్లా పోలీస్ అధికారి, నంద్యాల వారి కార్యాలయానికి అప్పీలు చేసిన తరువాత నిందితుడు గొల్ల మహేష్ ను రక్షించేందుకు, కేసును నీరు కార్చేందుకు ఎట్టకేలకు తూతూ మంత్రంగా అనుమానాస్పద మృతి అంటూ 194 బి.ఎన్.ఎన్.ఎస్. సెక్షన్ క్రింద క్రైమ్ నంబర్ 117/2025 గా 19.07.2025 నాడు ఆత్మకూరు పోలీస్ వారు కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు.జాతీయ మాల మహానాడు జాతీయ కార్యదర్శి సోగరాజు మునెయ్య మాట్లాడుతూ ఆత్మకూరు సిఐ రాము పిర్యాదులు అందలేదని చెబుతూనే రెండు నెలల తరువాత కేసు ఎలా కట్టారు? అని ప్రశ్నించారు? అంతేకాకుండా బాదితుల నుండి పిర్యాదులు తీసుకొని కేసు నమోదు చేయనపుడు ఆత్మకూరులో పోలీసు స్టేషన్ ఎందుకు? అక్కడ పోలీసులు ఎందుకు? ఎవరికోసం పోలీసులు పనిచేస్తున్నారో ? తెలియజేయాలని, విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉంటూ, నిందుతులను కాపాడుతూ పోలీస్ వ్యవస్థకే మచ్చ తెస్తున్న ఆత్మకూరు డిఎస్పి రామంజి నాయక్ మరియు సిఐ రాము ల ప్రవర్తనపై పోలీస్ ఉన్నతాధికారులు బహిరంగంగా విచారించి తగు చర్యలు తీసుకొని పోలీస్ పరువు కాపాడాలని జాతీయ మాల మహానాడు డిమాండ్ చేస్తుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో బరిగెల జయమ్మ, బరిగెల ప్రసన్న కుమారి, బరిగెల అరుణ జ్యోతి, మాల మహానాడు సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రావణమాసం ఆరంభం

## వ్రతాలు, నోములకు పెద్దపీట



**తిరుమల, జూలై 25ఆంధ్ర ప్రగతి**
తెలుగు మాసాల్లో ఐదో మాసం శ్రావణ మాసం. శ్రావణ మాసం వర్ష ఋతువులో వస్తుంది.. కనుక విరివిగా వర్షాలు కురుస్తాయి. ఈ నెల హిందువుల లోగిళ్ళు ఆలయాలను తలపిస్తాయి. విష్ణువు, లక్ష్మీదేవులకు అత్యంత ఇష్టమైన మాసం శ్రావణ మాసం.. ఈ నెలలో మహిళలు వ్రతాలు, నోములు, పూజలను ఆచరిస్తారు. ఈ నెలలలో ఆచరించే పూజల వలన విశేష ఫలితాలు లభిస్తాయని పెద్దల చెబుతారు. పౌర్ణమి రోజున చంద్రుడు శ్రవణ నక్షత్రంలో ఉంటాడు.. కనుక ఈ మాసానికి శ్రావణ మాసం అని పేరు వచ్చింది. శ్రీ మహావిష్ణువు జన్మనక్షత్రం శ్రవణ నక్షత్రం.. ఈ నక్షత్రం పేరుతొ ఏర్పడిన శ్రావణమాసం అని.. ఈ మాసంలో చేసే పూజలు అత్యంత ఫలప్రదమని పురాణాల కథనం. లక్ష్మీ ప్రదమైన మాసం.. శ్రావణ మాసం ఈ ఏడాది జూలై 25 వ తేదీ శుక్రవారం నుంచి ప్రారంభం అయ్యింది. శ్రావణ మాసం వచ్చిందంటే చాలు మహిళలు ఆనందిస్తారు. తొలిరోజే శుక్రవారంతో ప్రారంభం కావడం విశేషం. ఇకపోతే శ్రావణం ప్రధానంగా వ్రతాలు, నోములకు ప్రసిద్ధి. మంగళవారం మంగళగౌరి వ్రతం.. ఈ మాసంలో మంగళవారం రోజున మంగళ గౌరీ వ్రతాన్ని ఆచరిస్తారు. పార్వతి దేవికి మరొక పేరు గౌరీ దేవిని పూజిస్తారు. ముఖ్యంగా కొత్తగా పెళ్ళయిన వధువులు.. తప్పనిసరిగా ఈ వ్రతాన్ని చేస్తారు. ఈ వ్రతాన్ని ఆచరించడం వల్ల మహిళలు నిండు ముత్తయిదువులుగా జీవిస్తారని ప్రతీతి. ఈ మాసంలో శ్రీ వరలక్ష్మీ దేవిని పూజిస్తూ.. ప్రతి శుక్రవారం వరలక్ష్మి వ్రతాన్ని ఆచరిస్తారు. ముఖ్యంగా పూర్ణిమ ముందు వచ్చే శుక్రవారం రోజున మహిళలు వరలక్ష్మీవ్రతాన్ని ఆచరిస్తారు. ఈ రోజున వరలక్ష్మీ దేవతను పూజిస్తే అష్టలక్ష్మీ పూజలకు సమానమని నమ్మకం. అంతేకాదు ఈరోజున లక్ష్మీదేవిని పూజిస్తే అష్టయిశ్వర్యాలైన సంపద, భూమి, శిక్షణ, ప్రేమ, కీర్తి, శాంతి, సంతోషం, శక్తి వంటివి లభిస్తాయని ప్రగాఢ విశ్వాసం. లక్ష్మీదేవి అనుగ్రహంతో కుటుంబం సుఖ సంతోషాలతో నెలకొంటుందని విశ్వాసం. దీపావళి తర్వాత జరుపుకొనే నాగులచవితి లాగ.. కొన్ని ప్రాంతాల్లో నాగుల పంచమిని జరుపుకుంటారు. ఈ రోజున నాగులకు పూజలను నిర్వహిస్తారు. పుట్ట వద్దకు వెళ్ళి పాలు పోసి, నాగ దేవతను పూజిస్తారు. ఉపవాసం ఉంటారు. శ్రావణశుద్ధ ఏకాదశిని పుత్రదా ఏకాదశి లేదా లలిత ఏకాదశి అంటారు. సంతానం లేనివారు వ్రతాన్ని ఆచరించడం శుభఫలితాను ఇస్తుంది. అంతేకాదు ఈరోజున గొడుగు దానమిస్తే విశేష ఫలితాన్ని పొందవచ్చని పురాణాలు పేర్కొన్నాయి. శ్రావణ రాఖీపూర్ణిమ లేదా జంధ్యాల పౌర్ణమి రోజు తన సోదరిని మేలు కోరుతూ సోదరి.. సోదరుని చేతికి రాఖీ కట్టే పండుగే ఈ రాఖీ పూర్ణిమ. అన్నదమ్ములకు రాఖీ కట్టి, నుదుట బొట్టు పెట్టి అనంతరం మిఠాయిలను తినిపిస్తారు. సోదరుడు సోదరిని ఆశీర్వదించి కానుకలివ్వడం ఆనవాయితీ. దీనినే జంధ్యాల పౌర్ణమి అని కూడా అంటారు. యజ్ఞోపవీతాన్ని విసర్జించి కొత్తది ధరించడం ఆచారం. అందుకనే ఈ పౌర్ణమిని జంధ్యాల పూర్ణిమ అని కూడా అంటారు. శ్రావణ పున్నమి రోజున శ్రీమహావిష్ణువు వేదాలను రక్షించడం కోసం హయగ్రీవ రూపం ధరించినట్లు పురాణాలు పేర్కొన్నాయి. అందుకనే ఈరోజున కొన్ని ప్రాంతాల వారు హయగ్రీవ జయంతిగా జరుపుకుంటారు. అయన అనుగ్రహం కోసం పూజలు నిర్వహించి.. శనగలు, ఉలవలతో గుగ్గిళ్ళు చేసి నైవేద్యంగా సమర్పిస్తారు. తుంగభద్రానది తీరంలో మంత్రాలయంలో కొలువైన శ్రీ గురు రాఘవేంద్రస్వామి జయంతి వేడుకలను శ్రావణ కృష్ణ విదియరోజున ఘనంగా నిర్వహిస్తారు. దుష్టశిక్షణ.. శిష్టరక్షణ కోసం శ్రీ మహావిష్ణువు ఎత్తిన ఎనిమిదో అవతారమే శ్రీకృష్ణ అవతారం. శ్రీకృష్ణపరమాత్మ జన్మించిన రోజు శ్రీకృష్ణాష్టమి. ఈరోజుని కృష్ణాష్టమి గా దేశ వ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటారు. ఈరోజు ఉట్టికొట్టడం ఆచారం. ఈ మాసంలో బహుళ పక్షంలో వచ్చే ఏకాదశిని కామిక ఏకాదశి అని అంటారు. ఈరోజున నవనీతాన్ని (వెన్న) దానం చేయడం వలన ఆర్ధిక ఇబ్బందులు తొలగుతాయని నమ్మకం. శ్రావణ మాసములో కృష్ణపక్ష అమావాస్యని పొలాల అమావాస్యగా పిలుస్తారు. సంతానం కోసం ఈరోజున మహిళలు ప్రత్యేక పూజను నిర్వహిస్తారు. ఈరోజున అమ్మవారిని పూజిస్తే.. పిల్లలు కలుగుతారని నమ్మకం.

# జగదీప్ ధన్‌ఖడ్‌కు టైప్ 8 బంగళా

### మాజీలకు ఇక్కడే వసతి





**న్యూఢిల్లీ, జూలై 25ఆంధ్ర ప్రగతి** ఉపరాష్ట్రపతి పదవి నుంచి తప్పుకున్న జగదీప్ ధన్‌ఖడ్‌కు కేంద్ర ప్రభుత్వం టైప్ 8 ప్రభుత్వ నివాస బంగళాను కేటాయించింది. ల్యూటియన్స్ ఢిల్లీ ప్రాంతంలో ఉండే –టైప్–8 భవనాలు మాజీ ప్రధాని, మాజీ రాష్ట్రపతుల కోసం ఉద్దేశించినవి. ఇప్పుడు ధన్‌ఖడ్‌కు కూడా ఇక్కడే కేటాయించారు. అత్యున్నత స్థాయి ప్రభుత్వ నివాస బంగళాలను –టైప్ 8గా వర్గీకరించారు. హోం మంత్రి అమిత్ షా, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌లకు ఈ కేటగిరీ భవనాలనే కేటాయించారు. మాజీ రాష్ట్రపతి, మాజీ ప్రధానులకు కూడా ఇవే భవనాలను ఇస్తారు. మాజీ రాష్ట్రపతులు ఈ భవనాల్లో తాము జీవించినంతకాలం ఉండేందుకు అనుమతి ఉంది. ఈ మేరకు ప్రెసిడెంట్ (ఫెసిలిటీ–స్) రూల్స్–1962లో ప్రత్యేక నిబంధనలను చేర్చారు. పదవి నుంచి దిగిపోయిన వెంటనే మాజీ రాష్ట్రపతికి ఈ భవనాన్ని కేటాయిస్తారు. రాష్ట్రపతి పదవికి ఉన్న ప్రాముఖ్యత, హోదా, భద్రతావసరాల రీత్యా మాజీ రాష్ట్రపతులకు ఈ బంగళాల్లో జీవితకాలం పాటు– ఉండేందుకు అనుమతినిచ్చారు. ఇక ప్రభుత్వ కార్యనిర్వాహక వ్యవస్థకు అధినేత అయిన ప్రధానికి కూడా రిటైర్మెంట్ తరువాత –టైప్ 8 భవనాన్ని కేటాయిస్తారు. స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ కమాండోలతో జెడ్ ప్లస్ సెక్యూరిటీ కల్పిస్తారు. మాజీ ప్రధానికి కూడా తన జీవితకాలమంతా –టైప్ 8 భవనంలో నివసించేందుకు అనుమతి ఉంది. అయితే, మాజీ ఉపరాష్ట్రపతులకు శాశ్వత ప్రాతిపదికన ప్రభుత్వ నివాస భవనాలు కేటాయించే నిబంధనలు ఏవీ ప్రస్తుతం లేవు. కానీ, జెడ్ ప్లస్ సెక్యూరిటీ కల్పించినప్పుడు, కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక అనుమతి ఇచ్చినప్పుడు మాజీ ఉపరాష్ట్రపతులకు టైప్–8 భవనం కేటాయించే అవకాశం ఉంది. ఈ భవనాన్ని ప్రభుత్వ సూచనల మేరకు ఖాళీ చేయకపోతే మార్కెట్ రేటు ప్రకారం అద్దె చెల్లించాల్సి ఉంటుంది.

# అశ్లీల కంటెంట్ యాప్‌లపై నిషేధం

### కఠిన చర్యలు తీసుకుంటామని కేంద్రం హెచ్చరిక

**న్యూఢిల్లీ జూలై 25ఆంధ్ర ప్రగతి**
అశ్లీల కంటెంట్‌ని ప్రసారం చేస్తున్న యాప్‌లపై కేంద్రం కొరడ ఝుళిపించింది. ఉల్లు, ఎఎల్‌టిటి సహా 24 యాప్‌పై కేంద్రం నిషేధం విధించింది. ఈ మేరకు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. 24 యాప్‌లు, వెబ్‌సైట్లపై నిషేధం విధించిన కేంద్రం.. ఆ వెబ్‌సైట్లు, యాప్‌లు ఇంటర్నెట్‌లో కనిపించకుండా చేయాలని ఇంటర్నెట్ ప్రొవైడర్లను ఆదేశించింది ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే.. కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. ఒటిటి ప్రసార యాప్‌లు, వాటి సర్వీస్ ప్రొవైడర్లు తాము ప్రసారం చేసే కంటెంట్ విషయంలో బాధ్యతయుతంగా ఉండాలని పేర్కొంది. చట్టాలను ఉల్లంఘించే కంటెంట్‌ను ప్రసారం చేస్తే తీవ్ర పరిణామాలు ఎదురుకోవాల్సి వస్తుందని స్పష్టం చేసింది. ఉల్లు, ఎఎల్‌టిటి, బిగ్ షాట్స్, బూమెక్స్, నవరస లైట్, గులాబ్ యాప్, కంగన్ యాప్, బుల్ యాప్, జల్వా యాప్, వావ్ ఎంటర్–టైన్‌మెంట్, లుక్ ఎంటర్–టైన్‌మెంట్, హిట్ ప్రైమ్, ఫినియో, షో ఎక్స్, సోల్ టాకీస్, అడ్డా టివి, హాట్‌ఎక్స్ విఐపి, హల్‌చల్ యాప్, మూడ్‌ఎక్స్, నియాన్‌ఎక్స్ విఐపి, ఫ్యుగి, మోజ్‌ఫిక్స్, –ట్రైఫ్లిక్స్ వంటివాటిని నిషేధించారు.దేశంలో అశ్లీల కంటెంట్‌పై నిషేధం ఉన్న సంగతి తెలిసిందే. అయితే ఏదో ఒక మార్గంలో ఆ కంటెంట్‌ని ప్రసారం చేస్తున్నారు కొందరు. కొందరైతే.. అశ్లీల కంటెంట్ కోసం ఏకంగా యాప్స్‌ని తయారు చేసి.. దాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నారు.

# వ్యవసాయం అతిపెద్ద ఉత్పాదక రంగం

### దానిని ప్రోత్సహిస్తే ఆర్థిక పురోగతి



**న్యూఢిల్లీ, జూలై 25ఆంధ్ర ప్రగతి** స్వవిప్లవానికి నాంది పలికేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలకు పూనుకోవాల్సిన అవసరం ఉంది. వ్యవసాయరంగ నిపుణులు ఇదే అభిప్రాయ పడుతున్నారు. నిరుద్యోగులు గ్రామాలకు తరలాలని, వారిని ఆదరించి వ్యవసాయం వైపు మళ్లించాలని అన్నారు. అలా చేయడం వల్ల వ్యవసాయంరంగం అతిపెద్ద ఉత్పాదక రంగంగా మారగలదని అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెంచితే మంచిదని అంటున్నారు. బహుళజాతి కంపెనీలకూ ఎర్ర తివాచీలు పరుస్తున్న ప్రభుత్వాలు రైతులను అనుత్పాదక రంగాలుగా చూస్తున్న తీరు దారుణం కాక మరోటి కాదు. రైతులను ఓటు బ్యాంకుగా చూడకుండా మనకు పట్టెడు అన్నం పెట్టే తల్లిగా చూసుకోవాలి. ఇకపోతే విదేశాల నుంచి నూనెల దిగుమతి వేరుశనగ రైతులకు శరాఘాతంగా మారింది. పంటల విధానంలో శాస్త్రీయ దృక్పథం లోపించడం, సేంద్రియ ఎరువుల బదులు రసాయన ఎరువులు వాడడం వల్ల భూమీ సారం తగ్గుతోంది. ఏ పంటపండించినా గిట్టుబాటు ధరలు లభించడం లేదు. రైతులని కాపాడుకుని, వ్యవసాయాన్ని పండగ చేస్తామంటున్న ప్రభుత్వాలు ఆ దిశగా అడుగులు వేయాలి. చిత్తశుద్ధితో పనిచేసే వ్యవస్థను రూపొందించాలి. ఈ ఆధునిక ఆర్థిక వ్యవస్థలో రైతుల సమస్యలు మరింత జఠిలం అవుతున్నాయే తప్ప పరిష్కారం

కావడం లేదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టమైన వ్యవసాయిక విధానం లేకపోవడం రైతుల పాలిట శాపంగా మారిపోయింది. ఫ్రీ మార్కెట్ అనేది ఒక అభూత కల్పన మాత్రమే అయ్యింది. దేశ ఆర్థిక వ్యవస్థ 8నుంచి 9శాతం వరకూ వృద్ధి జరుగుతున్న ప్పటికీ, వ్యవసాయ ఉత్పత్తులు పెరుగుతన్నా రైతుల ఆర్థిక వ్యవస్థ మాత్రం బాగుపడడం లేదు. ఇబ్బడిముబ్బడిగా ఆహారధాన్యాలను దిగుమతి చేసుకోవడం కూడా రైతులకు శాపంగా మారింది. కల్తీలు కూడా రైతును కాటేస్తున్నాయి. మన అసవరాలకు సరిపడా కందులు, మిరప, ఇతర పంటలను రైతులు చెమటోడ్చి పండించినా వాటిని కొనుగోలు చేయడం లేదు. ఇతర దేశాల నుంచి ఆహార ధాన్యాల దిగుబడి తక్షణం ఆగిపోవాలని అన్నారు. ఆర్థిక పునరుత్తేజానికి, వృద్ధిరేటును పెంచడానికి నవతరం సంస్కరణలు అవసరమని తెలిపారు. విద్యుత్తు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)ల రంగాల సమస్యలు సత్వరం పరిష్కరించాల్సి ఉందని, ప్రైవేటు పెట్టుబడులు పెరిగేందుకు సరికొత్త సంస్కరణలు అవసరమని తెలిపారు. ప్రైవేటురంగ విశ్లేషకుల నుంచి వృద్ధిరేటు అంచనాలు వేర్వేరుగా ఉంటున్నాయని, వీటిల్లో చాలావరకు ప్రభుత్వ అంచనాల కంటే తక్కువగా ఉంటున్నాయని గుర్తు చేశారు. ఆర్థిక వ్యవస్థ మందగమనం తీవ్ర ఆందోళనకరమని, పరిష్కారానికి నూతన సంస్కరణలు అవసరమని నిపుణుల హెచ్చరికలు పట్టించుకోవడం లేదు. విద్యుత్తు, ఎన్‌బీఎఫ్‌సీ రంగాల్లో సత్వరం సమస్యలు పరిష్కరించాలి. ప్రైవేటు రంగం నుంచి పెట్టుబడులు వచ్చేలా దీర్ఘకాలిక దృక్పథం కలిగిన సంస్కరణలూ కావాలి. ప్రోత్సాహకాలు, ఉద్దీపనలు తాత్కాలికంగా మాత్రమే ఉపకరిస్తాయి. ఇప్పుడు మెరుగైన విధానం కాదు, ప్రత్యేక విధానం కావాలి.

# సమస్యలపై చర్చించే చిత్తశుద్ధి ఏదీ !

**జూలై 25ఆంధ్ర ప్రగతి**
పార్లమెంటులో సమస్యపై ఎలా చర్చించాలన్న వ్యూహం కనబడడం లేదు. తాము వాయిదా తీర్మానాలు ఇస్తే చర్చ జరగాల్సిందే అన్న ధోరణిలో విపక్షలు ఉన్నాయి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఇది కుదరదు. వాయిదా తీర్మానాలు లేకున్నా అసవరమైన సందర్భాల్లో రూల్ పొజిషన్‌ను బట్టి సమస్యలపై చర్చకు అవకాశం ఉంది. దీనిని ఉపయోగించుకోవడంలో విపక్షాలు విఫలం అవుతున్నాయి. ఎందుకంటే ఐదురోజులుగా పార్లమెంట్ ఎలాంటి కార్యలాపాలు లేకుండా సాగుతోంది. అనేక అంశాలు చర్చించాల్సి ఉంది. వారు కోరుకుంటునన బీహార్ ఓటరల్ జాబితాయే గాకుండా అనేక అంశాలు ఉన్నాయి. వాటిని ఎలా చర్చించాలో ప్రణాళిక లేకుండా పోతోంది. తమ గొంతు నొక్కుతున్నారని విపక్షనేత రాహుల్ చెప్పడం సిగ్గుచేటు. రూల్ ప్రకారం పోతే ప్రభుత్వమే దిగివస్తుంది. చర్చినట్లు అంశం ఏదైనా చర్చిస్తారు. సమాధానం ఇస్తారు. అలా చేయడంలో విపక్ష పార్టీలో విఫలం అవుతున్నాయి. కేవలం వాయిదా తీర్మానాలు ఇవ్వడం, సభను అడ్డుకోవడం, బయటకు వచ్చి మీడియాతో మాట్లాడడం మాత్రమే చేస్తున్నారు. నిజానికి జాతీయ జలవిధానం, నదుల అనుసంధానం, రైతుల సమస్యలు చర్చించడానికి సమయం కావాలి. వీటిని ఎజెండగా చేసుకోవాలి. రైతుల సమస్యలను పట్టించుకునే దిశగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కీలక నిర్ణయాలు తీసుకోవాలి. ఏటా ఒక విధానంగా గాకుండా, రుణ మాఫీలు అవసరం లేని విధంగా రైతులు స్వయం సమృద్ధిగా ఎదిగేలా చేయాలి. విత్తనాలు, పురుగు మందుల వ్యాపారస్థులు నకిలీలతో రైతులను నిలువునా ముంచుతున్నారు. అధికారులు చోద్యం చూస్తున్నారు. బ్యాంకు అధికారులు, ఏజెంట్లు కలిసి రైతులకిచ్చే ఋణాలలో కోత పెడుతున్నారు. అడ్తిదారులు, కమిషన్ ఏజెంట్లు, మార్కెట్ అధికారులు, అంతిమంగా అందరూ రైతులను ముంచడానికే సిద్ధంగా ఉంటున్నారు. రైతుల సమస్యలు రాజకీయ పక్షాలకు ప్రచార కార్యక్రమంగానే మిగిలిపోయాయి. పాలకపక్షం అయినా, ప్రతిపక్షం అయినా రైతుల సమస్యలను పరిష్కరిం చడానికి చిత్తశుద్ధితో ఆలోచించడం లేదు. గిట్టుబాటు ధరలు లేక వచ్చిన ఆదాయం కూలీల ఖర్చుకు సరిపోతుంది. లక్షలాది మంది రైతులు వర్షాలు కురిసి కాలం కలసివచ్చినా ధరలు రాక నష్టపోతున్నారు. వీటికితోడు భారీ వర్షాలు దేశాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. వర్షాల ద్వారా మనం పాఠాలు నేర్చుకోవాలి. వరదలను నివారించి, నీటిని నిల్వ చేసుకునే పద్ధతలను



అవలంబించాలి. దేశవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు వాగులు వంకలు పొంగుతున్నాయి. జలాశయాలు నిండుకుండల్లా మారాయి. ప్రాజెక్టుల నుంచి నీరు విడుదల చేయడంతో మళ్లీ సముద్రంలోకి నీరు చేరుతోంది. ముందస్తు ప్రణాళికలు లేకపోవడంతో దేశంలో నీటి యాజమాన్యం సరిగా లేదని ఏటా కురుస్తున్న వర్షాలు స్పష్టం చేస్తున్నాయి. దీనికితోడు అనేక జలాశయాల్లో పూడిక పేరుకుని పోతోంది. ఏటేటా వర్షాలతో ఒండ్రు చేరుతోందని నిపుణులు చెబుతున్నారు. ఉత్తరాదిలో అనేక నదులు ఉప్పొంగాయి. చివరకు మళ్లీ నీరు సముద్రానికి చేరింది. తాజాగా కూడా అలాంటి పరిస్థితిని చూస్తున్నాం. ఇప్పటికైనా పాలకులు జాతీయ జలవిధానం రూపొందించాల్సి ఉంది. పార్లమెంటులో ఇలాంటి సమస్యలు చర్చకు రావడం లేదు. ఎంతసేపు ఓటు బ్యాంక్ రాజకీయాలు తప్ప సమస్యలపై ఎంపిలకు అవగాహన లేకుండా పోతోంది. అలాగే వర్షాలతో నష్టపోయిన రైతులకు అండగా నిలిచి వారిని ఆదుకునే ప్రయత్నం చేయాలి. వ్యవసాయం పై కూడా జీతాయ విధానంతో ముందుకు సాగాలి. వ్యవసాయాన్ని లాభసాటి చేసేలా, దిగుబడులు తగ్గించుకుని మన రైతులను ప్రోత్సహిచేలా చూసుకోవాలి. వివిధ రాష్ట్రాల్లో చెరువులను మింగిన పాపానికి ఇటీవల కురిసిన వర్షాలకు నగరాలు, పట్టణాలు, గ్రామాలు నీట మునిగాయి. ఇదంతా పాలకుల పాపం కాక మరోటి కాదు. ఈ క్రమంలో గొలుసుకట్టు చెరువులను రక్షించు కోవాలి. పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకుని కనీసం ఇప్పటి నుంచయినా నీటి అవసరాలను గుర్తించి పొదుపు చేయడం అలవాటు చేసుకో వాలి. వ్యవసాయ ఉత్పత్తులను పెంచి విదేశాలకు ఎగుమతులు చేసే విధంగా సన్నద్ధం కావాలి. ఆర్థికమాంద్యం ముంచుకొస్తున్న వేళ కేంద్రం ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాలి. వ్యవసాయ రంగం పురోగమిస్తే, ధాన్యం దిగుబడులు తగ్గితే తప్ప భారత ఆర్థికరంగం పురోగమించదు. ఇప్పటికే వరిధాన్యం ఇబ్బడిముబ్బడిగా పండించడం వల్ల గోదాముల్లో మగ్గి పోతోంది. వాటిని వాడుకునే విధంగా కార్యక్రమాలు అమలు చేసుకోవాలి. అదేపనిగా వరి పండించకుండా ఇతర పంటలపైనా ప్రోత్సాహం కల్పించాలి. ఆధునిక వ్యవసాయం దిశగా పురోగమించాలి. నిరుద్యోగం పెరిగడంతో.. ప్రజలు ఉపాధి కోసం ఎదురు చూస్తున్నారు. వారిని వ్యవసాయం వైపు మళ్లించేలా పథకాలు చేపట్టాలి. తక్షణ ఉపాధికి ఇదొక్కటే ప్రత్యామ్నాయం కాగలదు. దీంతో ఆహార ఉత్పత్తులు కూడా పెరగ గలవు. కరువులు వచ్చినా, అధికంగా వర్షాలు కురిసినా రైతుల దుర్భర పరిస్థితులలో ఎలాంటి మార్పు కనిపించడం లేదు. మరోవైపు ప్రతి సంవత్సరం వేలాది మంది రైతులు పట్టణాలకు వలస వెళ్ళి దినసరి కూలీలుగా మారుతున్నారు. ప్రధానంగా అనేకరకాల పప్పు ధాన్యాలు, వంట నూనెల దిగుమతులను పూర్తిగా నిషేధించుకుని, దేశీయంగా పండించుకునేలా వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి. రైతులనే ప్రోత్సహించి పంటలనే కాపాడుకునేలా రైతాంగ విధానాలపై చర్చ చేయాలి. రైతులకి మేలు చేస్తానన్న ప్రభుత్వాల ప్రకటనలు ఆచరణలోకి రావడం లేదు. అంతెందుకు రైతులకు గిట్టుబాటును మించి ధరలు దక్కేలా చేస్తామన్న ప్రధాని మోడీ వాగ్దానాన్ని నెరవేర్చగలగాలి. వ్యవసాయ ఉత్పత్తి వ్యయాలు అనేక రెట్లు పెరిగిపోవడంతో పాటు విత్తనాల దగ్గర నుంచి నకిలీలు రైతులను కుంగదీస్తున్నాయి. ఈ విధానాలనే పార్లమెంటులో చర్చించడం లేదు. రాజకీయ పార్టీల ప్రాధాన్యాలు మారాలి. ప్రజల సమస్యలను ఎంచుకున ముందకు సాగితేనే మంచిది.

# తల్లి అవాలనుంది.! కానీ..



ఆడవాళ్లకు మాతృత్వం అనేది ఎంతో గర్వం. ఆడదానిగా పుట్టాక అమ్మ అని పిలిపించుకోవాలని ఎవరికైనా ఉంటుంది. దానికి ఎంతటి సెలబ్రిటీలైనా మినహాయింపు కాదు. అందరిలానే తనకు కూడా అమ్మ కావాలని ఉన్నట్టు సక్సెస్‌ఫుల్ హీరోయిన్, మరాఠీ భామ మృణాల్ ఠాకూర్ చెప్తున్నారు. అయితే అమ్మడి కామెంట్స్ విని అంతా షాకవుతున్నారు. టాలీవుడ్ సక్సెస్‌ఫుల్ హీయిన్లలో మృణాల్ ఠాకూర్ కూడా ఒకరు. మృణాల్ ముందు బాలీవుడ్ లో పరిచయమైనా అక్కడ తనకు రావాల్సిన గుర్తింపు రాలేదు. అయితే ఏ ముహూర్తాన సీతారామం సినిమా చేశారో కానీ అప్పట్నుంచి మృణాల్ కెరీర్ టర్న్ అయిపోయింది. సీతారామంతో తెలుగు ప్రేక్షకుల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు మృణాల్. ఆ సినిమా తర్వాత అమ్మడికి అవకాశాలు క్యూ కట్టాయి. కానీ మృణాల్ మాత్రం చాలా సెలెక్టివ్ గా సినిమాలను ఎంపిక చేసుకుంటూ కెరీర్ లో ముందుకెళ్తున్నారు. ప్రస్తుతం టాలీవుడ్ లో షానియెల్ డియో దర్శకత్వంలో అడివి శేష్ హీరోగా డెకాయిట్ అనే సినిమా చేస్తున్న మృణాల్ మరో వైపు బాలీవుడ్ లో కూడా సినిమాలు చేస్తున్నారు. ప్రస్తుతం మృణాల్ నటించిన సన్నాఫ్ సర్దార్2 రిలీజ్ కు ముస్తాబవుతుంది. ఆ చిత్ర ప్రమోషన్స్ లో యాక్టివ్ గా పాల్గొంటున్న మృణాల్ పెళ్లిపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనక్కూడా త్వరగా పెళ్లి చేసుకుని, పిల్లలను కనాలని ఉందని చెప్పిన మృణాల్, ఫ్యూచర్ లో భర్త, పిల్లలతో కలిసి ఉన్న లైఫ్ గురించి నిరంతరం కలలు కంటుంటానని అన్నారు. కానీ ప్రస్తుతానికి మాత్రం తన ఫోకస్ మొత్తం కెరీర్ పైనే ఉందని, ఇంకా ఇండస్ట్రీలో చాలా చేయాలనుకుంటున్నట్టు మృణాల్ తెలిపారు. కెరీర్ పరంగా ఫుల్ గా శాటిస్‌ఫై అయ్యాకే వ్యక్తిగత జీవితంపై ఫోకస్ చేస్తానని మృణాల్ చెప్పిన మాటలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అయితే మృణాల్ ఈ విషయంలో చాలా తెలివిగానే ఆలోచిస్తున్నారు. పెళ్లి తర్వాత ఎంతలేదన్నా హీరోయిన్లకు ఆఫర్లు తగ్గడం కామన్. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకునే మృణాల్ పర్సనల్ లైఫ్ పై ఫోకస్ చేయడం లేదని అనుకోవచ్చు.

# సినిమాల విషయంలో నా సోదరుడికి ఎలాంటి సలహాలు ఇవ్వను

సినిమాల విషయంలో తన సోదరుడు ఆనంద్‌కు ఎలాంటి సలహాలు, సూచనలు ఇవ్వనని, ఆ స్థానంలో తన కుమారుడు ఉన్నా ఇలాగే వ్యవహరిస్తానని సినీ నటుడు విజయ్ దేవరకొండ అన్నారు. ‘కింగ్‌డమ్’ చిత్రం ప్రమోషన్‌లో భాగంగా ఒక ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, ఫలానా సినిమా చేస్తున్నానని తన సోదరుడు తనకు చెబుతాడని, తాను అక్కడి వరకే ఉంటానని చెప్పారు. కథ ఏమిటి? దర్శకుడు ఎవరు? వంటి విషయాలను అడగనని తెలిపారు.తన సోదరుడు ఏదైనా పొరపాటు జరిగితే వాటి నుండి పాఠాలు నేర్చుకోవాలని తాను కోరుకుంటానని అన్నారు. నటుడిగా ప్రయాణం ఎంత కష్టమో తనకు తెలుసునని విజయ్ దేవరకొండ అన్నారు. “ఇతర విషయాలు ఏవీ పట్టించుకోకుండా నీపై నీకు నమ్మకం ఉంటేనే చిత్ర పరిశ్రమలోకి అడుగు పెట్టు” అని తాను ముందే చెప్పానని అన్నారు.మొదట్లో కొంత కష్టమైనప్పటికీ క్రమంగా తెలుసుకుంటూ ముందుకు సాగుతున్నాడని అన్నారు. తనదైన శైలి కథలను ఎంపిక చేసుకుంటూ ముందుకు వెళుతున్నాడని తెలిపారు. భవిష్యత్తులో తన కుమారుడి విషయంలోనూ ఇలాగే ఉంటానని స్పష్టం చేశారు.







# యాక్షన్ ప్యాక్‌డ్ ‘వార్ 2’ ట్రైలర్!

యంగ్ టైగర్ ఎన్టీఆర్, బాలీవుడ్ నటుడు హృతిక్ రోషన్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న తాజా చిత్రం ‘వార్ 2’. ప్రముఖ బాలీవుడ్ నిర్మాణ సంస్థ యశ్‌రాజ్ ఫిలిమ్స్ బ్యానర్‌పై ఆదిత్యచోప్రా నిర్మిస్తున్నారు. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ చిత్రానికి అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్నారు. ఆగస్టు 14న ఈ సినిమా వరల్డ్‌వైడ్‌గా విడుదల కానుంది.

ఈ సందర్భంగా మేకర్స్ మూవీ ట్రైలర్‌ను తాజాగా విడుదల చేశారు. ఈ ట్రైలర్ ఫుల్ యాక్షన్ ప్యాక్‌డ్‌గా ఉంది. ట్రైలర్‌లో హీరోలిద్దరీ అద్భుత డైలాగ్స్‌తో పాటు యాక్షన్ హైలైట్‌గా నిలిచింది. “ఎవరూ చేయలేని పనిని నేను చేసి చూపిస్తాను.. ఎవరూ పోరాడలేని యుద్ధాన్ని నేను పోరాడుతాను” అంటూ ఎన్టీఆర్ చెప్పిన డైలాగ్ బాగుంది.

యశ్‌రాజ్ ఫిలిమ్స్ స్పై యూనివర్స్‌లో రాబోతున్న ఈ చిత్రంలో.. హృతిక్ రోషన్ కబీర్‌గా తిరిగి రాగా, తారక్ ప్రతినాయకుడి పాత్రలో బాలీవుడ్‌లోకి అడుగుపెడుతున్నారు. కియారా అద్వానీ కూడా కీలక పాత్రలో నటిస్తున్నారు

## ‘హరిహర వీరమల్లు’లో ఆ సీన్స్ కట్.. తగ్గిన సినిమా నిడివి



పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎంతోకాలంగా ఆత్రుతగా ఎదురుచూసిన సినిమా ‘హరిహర వీరమల్లు’ నిన్న విడుదలైన విషయం తెలిసిందే. ఈ సినిమాకి సంబంధించి చిత్ర బృందం హైదరాబాద్‌లో సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ సందర్భంగా ప్రేక్షకులకు పవన్ కృతజ్ఞతలు తెలియజేశారు. అయితే, మూవీలోని కొన్ని సీన్లపై ప్రేక్షకులు పెదవి విరిచారు. ముఖ్యంగా ద్వితీయార్థంలో వచ్చే హార్స్ రైడింగ్ సీన్లు, వీఎఫ్ఎక్స్ వర్క్ అంతగా నప్పలేదని అసంతృప్తి వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో మేకర్స్ కీలక నిర్ణయం తీసుకున్నారు. కొన్ని సన్నివేశాలను తొలగించి నిడివిని తగ్గించారు. సెకండాఫ్‌లో ఉన్న హార్స్ రైడింగ్, తోడేలు తదితర సీన్లను పూర్తిగా తొలగించారని తెలుస్తోంది. ముఖ్యంగా కోహినూర్ వజ్రం కోసం వెళ్లే జర్నీకి సంబంధించిన సన్నివేశాలను కట్ చేసినట్టు సమాచారం. మొత్తం మీద సినిమాకు 2 గంటల 42 నిమిషాల నిడివి ఉండగా, ఇప్పుడు దాన్ని 2 గంటల 22 నిమిషాలకు ట్రిమ్ చేశారని తెలుస్తోంది. ఈ మార్పులతో గురువారం రాత్రి నుంచే అన్ని థియేటర్లలో షోలు నడిచాయని సమాచారం. ఇక, మూవీకి వస్తున్న రెస్పాన్స్ నేపథ్యంలో సక్సెస్ మీట్ ఏర్పాటు చేయగా, ఈ ఈవెంట్‌లో పవన్ మాట్లాడుతూ ఫ్యాన్స్‌ను ఉద్దేశించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సోషల్ మీడియా ట్రోల్స్, నెగటివ్ కామెంట్స్‌ను పట్టించుకోవద్దని తెలిపారు. విమర్శలు వస్తే, మన స్థాయిని గుర్తు చేస్తున్నట్టే అని ఆయన అభిప్రాయపడ్డారు. అవసరమైతే విమర్శలను తిప్పికొట్టాలని అభిమానులకు పవన్ పిలుపునిచ్చారు.

# ఎంత హైటున్నా హీరోయినా ఒకే!



లవ్ టుడే%-%తో టాలీవుడ్ కి పరిచయమైన యంగ్ బ్యూటీ ఇవానా గురించి చెప్పాల్సిన పనిలేదు. తొలి సినిమాతోనే అమ్మడు యువత అటెన్షన్ డ్రా చేసింది. యూత్ ఫుల్ లవ్ స్టోరీ తో కుర్ర కారులో క్రేజీ బ్యూటీగా మారిపోయింది. వైవిధ్యమైన హావభావాలతో ప్రేక్షకులకు దగ్గరైంది. ఇటీవలే %-%సింగిల్%-% తో తెలుగులోనూ లాంచ్ అయింది. ఈ సినిమా కూడా మంచి విజయం సాధించింది. కేతిక పాత్ర కంటే ఇవానా పాత్రకే మంచి రెస్పాన్స్ వచ్చింది. అలాగే త్రినాధరావు నక్కిన దర్శకత్వంలో ఓ ఛాన్స్ అందు కుందనే ప్రచారం జరుగుతోంది. సక్సెస్ పరంగా ఇవానా ట్రాక్ బాగుంది. కోలీవుడ్ తో పాటు టాలీవుడ్ లోనూ పాజిటివ్ గానే కనిపి స్తుంది. యూత్ లోనూ క్రేజీ బ్యూటీగా వైరల్ అవుతోంది. %-%సింగిల్%-% తర్వాత తెలుగులో ఫాలోయింగ్ రెట్టింపు అయింది. ఇక ఇవానా వయసు విషయానికి వస్తే అమ్మడికి 25 ఏళ్లు. అంటే స్టార్ హీరోలందరితో నటించే వయసే. 20 ఏళ్ల నటే 50-40 ఏళ్ల వయసున్న హీరోలతో రొమాన్స్ చేస్తున్నారు. కాబట్టి ఇవానికి వయసు అడ్డండి కాదు. మరి హైట్ సంగతేంటి? అంటే అమ్మడు ఎత్తు ఐదు అడుగులే. అయినా సరే నటిగా తానెంత ఎంత పెద్ద స్టార్ అయినా....ఎంత హైట్ ఉన్నా సరే మ్యానేజ్ చేస్తానంటూ నమ్మకాన్ని వ్యక్తం చేసింది. నటికి హైట్ అన్నది పెద్ద సమస్య కాదని ధీమా వ్యక్తం చేసింది. నిజమే నిజం గా హైట్ సమస్య అయితే రష్మికా మందన్నా నేషనల్ క్రష్ అయ్యేదా? నేడు రష్మిక పాన్ ఇండియా క్రేజ్ గురించి చెప్పాల్సిన పనిలేదు. రష్మిక ఇవానా కంటే కాస్త పొడవు. 5.3 రష్మిక హైట్. కానీ కెమెరా యాంగిల్ లో రష్మిక కంటే ఇవానా ఎత్తుగా కనిపిస్తుంది. శరీరంలో కొన్ని రకాల మార్పులే ఇలాంటి వ్యత్యాసానికి దారి తీస్తుంటాయి? అన్నది తెలిసిందే. ప్రస్తుతం ఇవానా టాలీవుడ్ నే టార్గెట్ చేసి పనిచేస్తున్నట్లు తెలిపింది. ఇక్కడ అవకాశాలు వస్తే ఇక్కడే బిజీ అవ్వాలని కోరుకుంటుంది. నటిగా ఇవానాను ఎంచాల్సిన పనిలేదు. మంచి పెర్ఫార్మర్. యువ నాయికలకు బాగా సెట్ అవుతుంది. కెరీర్ ఇప్పుడే మొదలైంది కాబట్టి నిర్మాతలకు అందుబాటులో ఉంటుంది. మరి ఇవానా ప్రతిభను ఎంత మంది గుర్తిస్తారో చూడాలి.

# కథకు మరింత మెరుగులు

సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శక ధీరుడు రాజమౌళి కాంబినేషన్‌లోని సినిమాలోని కొంత భాగం చిత్రీకరణ ఈ ఏడాది మార్చిలోనే పూర్తయింది. ఒడిశాలోని కొరాపుట్ జిల్లా సిమిలిగూడ సమీపంలోని మాలి, పుట్‌సీల్, బాల్డ ప్రాంతాల్లో షూటింగ్ చేశారు. ఈ షెడ్యూల్ లో పలు కీలక సన్నివేశాలు చిత్రీకరించారు. ఆ తర్వాత కెన్యా లో మరో షెడ్యూల్ కోసం ప్లాన్ చేశారు. అది ఈ నెలలో ఇప్పటికే ప్రారంభమైపోయి ఉండాలి. కానీ, అక్కడి పరిస్థితుల వల్ల ఈ షెడ్యూలు రద్దయింది. దీంతో షూటింగ్‌కు బ్రేక్ పడింది. కెన్యాకు ప్రత్యమ్నాయంగా సౌతాఫ్రికాను ఎంచుకున్నట్లు తెలిసింది. కానీ, ఇంకా షూటింగ్ ప్రారంభం కాలేదు. ఈ గ్యాప్‌లో రాజమౌళి సినిమా కథను ఇంకా చెక్కుతున్నారని తెలిసింది. ఈ సినిమా 2027లో థియేటర్లలోకి వస్తుందని అంటున్నారు.

